# పిచ్చితల్లి

# పిచ్చితల్లి

పిచ్చమ్మ కొడుకు పిచ్చేశ్వరరావు.

పిచ్చేశ్వరరావు ఎమ్. ఎ. ప్యాసైనాడని నిన్న లాయరు రంగనాథంగారు భార్య సుందరమ్మ దగ్గర అర్ధగంట ఉపన్యాసం దంచిపారేశాడు.

"ఇదిగో...ఏమేవ్! ఇలాంటివాళ్ళే పైపైకిపోతారు. మన అబ్బాయిలాంటివాళ్ళు అస్తమానం రేడియోసిలోనూ, ఇంగ్లీషు మాటినీలూ అంటూ కాలేజీ లెగ్గొట్టేవాళ్లు ఏం పైకి వస్తారే!" అంటూ పిల్లలని అదుపులోనూ, క్రమశిక్షణలోనూ పెట్టడం చేతగాని భార్యని తన ఉపన్యాసంతో ఊపిరి సలపకుండాచేసి, "టైము అయిపోతోంది కోర్టుకి" అంటూ పరుగు తీశాడు.

పిచ్చమ్మ రంగనాథంగారి ఇంట్లో పన్నెండు సంవత్సరాలుగా వంట మనిషిగా పనిచేస్తూంది. ఆవిడ మంచితనం, ఓరిమి ఆ కుటుంబాన్ని ఆకట్టుకున్నాయి.

పిచ్చమ్మ పనిలో చేరేరోజున సుందరమ్మ, "జీతం ఎంత కావాలి?" అన్నప్పుడు, "మీ దయ! ఎంత ఇచ్చినా సరే" అంది పిచ్చమ్మ.

"అయ్యో! ఇలా అయితే ఎలా బ్రతుకుతావే, పిచ్చి తల్లీ! ఈ రోజుల్లో ఇంకా ఇలాంటి అమాయకులున్నారా! మీ దయ అనేవాళ్లు" అన్నది సుందరమ్మ. పిచ్చమ్మ అలా సుందరమ్మకే కాక యింటా బయటా పిచ్చితల్లే అయింది. లాయరుగారి ఇంటి పనులు గబగబా పూర్తిచేసుకొని, ఇరుగూ పొరుగుకికూడా సహాయపడి తన శ్రమని రూపాయల్లోకి మార్చి కొడుక్కి చదువు చెప్పించింది పిచ్చితల్లి.

పిచ్చేశ్వరరావు కాలేజీ ఫీజులకీ, పుస్తకాలకీ అప్పుడప్పుడూ సుందరమ్మగారుకూడా సహాయపడుతూనే ఉంది. తండ్రి చిన్నప్పుడే పోయినా తల్లి ఎంత కష్టపడి తనని చదివిస్తూందో పిచ్చేశ్వరరావుకి అర్థమవుతూనే ఉంది. అందుకే ఏకాగ్రతతో చదివి ఎమ్. ఏ. పాసై, ఐ. ఏ. ఎస్. పరీక్షకు కూడా కూర్చున్నాడు. చదువుకుంటూనే రెండు మూడు ప్రైవేట్లు కూడా చెప్పి, ఆ డబ్బుతో తన బట్టలూ అవీ కొనుక్కునేవాడు.

పిచ్చితల్లి కొడుకు ఐ. ఏ. ఎస్. పరీక్షకి కూర్చున్నాడంటే ఎవరూ విస్తుపోలేదు. కాని, సెలెక్షన్ వచ్చి,

ట్రెయినింగ్ అయి, సబ్ కలెక్టర్‌గా ఉద్యోగం వచ్చిందనే సరికి అందరూ తెల్లముఖాలు వేశారు.

"పిచ్చితల్లి ముద్దులపట్టి అసాధ్యుడేనే! ఇంతకీ అసలు వీళ్ళది ఏ శాఖ, ఏ ఊరు, ఏ గోత్రం?"

ఇలాంటి ఆరాలు మొదలైనాయి, ఆడపిల్లల తండ్రులకు.

పిచ్చేశ్వరరావు వంటలక్క పిచ్చితల్లి కొడుకుగా కనిపించటంలేదు. కలెక్టర్ పిచ్చేశ్వరరావు, ఐ.ఎ.ఎస్. గా కనిపిస్తున్నాడు. ఆ పైన అందంగానే ఉన్నట్టుగా కనిపిస్తున్నాడు.

'అంతకుముందు అంటక తిరింపూ ఆ అవతారం ఏమిటీ' అనుకున్న అమ్మాయిల కళ్ళకి అది కొత్త ఫాషన్ కాబోలు, అనిపిస్తూంది. నల్లగా కాస్త పొట్టిగా లావుగా వుండే పిచ్చేశ్వరరావు అమాంతం పెద్దహీరో అయి కూర్చున్నాడు.

పద్మప్రియ అనే అందమయిన అమ్మాయి తండ్రి పార్థసారథిగారి కళ్లు ఈ హీరోమీద పడ్డాయి.

'నలుపు బాగా' అన్న స్నేహితుడితో అర్ధగంట వాదించారు ఆయన 'చామన చాయ' అని ఒప్పించి మరీ వదిలారు ఆయన్ని.

"ఇంతకీ చదువూ, హోదా ముఖ్యంకాని, శరీర రంగు తెలుపైతేనేం, ఎరుపైతేనేం? ఎర్రగా అందంగా ఉన్నాడని ఏ హోటల్లోనో కప్పులు కడుగుతున్న కుర్రాడికి పిల్ల నివ్వంకదా! అసలు నన్నడిగితే ఆంధ్రుల్లో, అందులో మనవాళ్ళలో ఐ.ఏ.ఎస్.లు ఎందరున్నారో లెక్కించండి. అసలు లేరండీ" అంటూ కూతురి ముఖంవైపు చూశారు.

"ఏం తల్లీ, డబ్బు మనకి ఉంది; హోదా, చదువూ అతని కున్నాయి. అందుకే యిప్పుడే వెడుతున్నాను. శాస్త్ర అగానా యెంత పోటీ వస్తుందో!" అని తనలో 'ఈ బి. ఏ. పూర్తిచేసేనా, పెట్టేనా? చదువుతుండగానే పెళ్ళికానిచ్చేస్తే ఆ తరువాత చదువు రాకున్నా మరేం ఫర్వాలేదు' అనుకొన్నాడు.

పద్మ సిగ్గుపడుతూనే తండ్రితో మరో సంగతి చెప్పింది.

"ఆయన తల్లి...లాయరుగారింట్లో..." మిగతాది మింగేసింది.

"ఊఁ...తల్లి ఏదైతేనేం? మనకి కావలసింది కుర్రాడు. నీకు తెలియదూ-ఉండు, తల్లీ నేనో పెద్ద ప్లాను వేసేశాను" అంటూ నవ్వుతూ వెళ్ళిపోయారు ఆయన, లక్షాధికారి పార్థసారధిగారు.

ఓడంత కారులో నాలుగు గజాల నలుచదరం అద్దె గది వెతుక్కుంటూ వచ్చి సరాసరి పిచ్చితల్లితో, వచ్చిన విషయం సూటిగా అడిగేశాడు

"చెల్లాయ్, నీ కొడుక్కి నా కూతుర్ని ఇవ్వాలని ఉంది నాకూ. ఒక్కగానొక్క కూతురు, పద్మప్రియ. నీకూ ఒక్కగానొక్క కొడుకు. లక్ష రూపాయలకి అధికారిణి రేపే వచ్చి పిల్లని చూసి మీకు సమ్మతమయితే, మనం సరాసరే మాట్లాడుకుందాం. మధ్యవర్తుల జోక్యం అనవసరం. నీవు చెల్లాయివి, నేను అన్నని. నేనో రెండు మాటలు చెబుతాను. ఆస్తి ఎలాగూ పిల్లపేరులోనే ఉంది. పోతే, అల్లుడికి కట్నం 'రొక్కం' రూపంలోనే ఇస్తాను. కాదూ? అబ్బాయి పేర ఆస్తి అంతా రాసేయమన్నా నాకేం అభ్యంతరం లేదు. ఆ ఇద్దరూ ఒకటయితే యెవరి పేరునవున్నా ఒకటేగా! రేపు నువ్వూ, అబ్బాయీ తప్పక వచ్చి అమ్మాయిని చూడండి. కారు సరిగ్గా నాలుగింటికి పంపిస్తాను" అంటూ వచ్చినంత హడావుడిగా వెళ్ళబోతూ, "అయ్యో! మరిచిపోయాను. ఇదుగో, అమ్మాయి ఫోటో కూడా తెచ్చాను" అంటూ ఫోటో పిచ్చితల్లి చేతిలో ఉంచి వెళ్ళిపోయాడు ఆయన.

ఆయన అలా వెళ్ళిపోగానే పిచ్చితల్లి గుండె పట్టుకుని కూర్చుండిపోయింది.

ఏమి టిదంతా? కలా, నిజంగా జరుగుతున్నదేనా? ఊరిలో పెద్దతల, బోలెడుడబ్బున్న శ్రీమంతుడు, నా ఇంటికి పిల్లనిస్తానని రావడమా! ఏమిటో...పిచ్చన్న ఉద్యోగంలో చేరటానికి ఊరికి వెడుతూ, 'అమ్మా మన కష్టాలు గట్టెక్కాయి. నీ వింక సుఖంగా కాలం గడుపుదువుగాని. నా

కోసం ఈ చేతులు ఎంత కాయలు కాచాయి!' అంటూ చేతులు రెండూ తీసి తన ముఖంమీద రాసుకుంటూ, 'నీవీ పని మానేయి ఈరోజునించే. నే వెడుతున్నాను. ఇల్లు తీసుకుని వెంటనే వచ్చేసి నిన్ను తీసుకు వెడతాను. అమ్మా, నన్ను ఆశీర్వదించు' అంటూ వంగి కాళ్ళకి నమస్కరిస్తున్నప్పుడు పిచ్చితల్లి కళ్ళనించి ఆనందాశ్రువులు జలజలా రాలాయి.

తను పడ్డ కష్టమంతా ఎక్కడపోయిందో! అంట్లగిన్నెలు తోమి తోమి చేతులు కాయలు కాచాయి. అన్నం వారుస్తుంటే గంజిపడి ఎడమకాలు తోడుగు ఊడిపోయింది అది మానటానికి రెండు నెలలు పట్టింది. ఇలాంటివి యెన్నో కష్టాలూ, అవమానాలూ ఎన్నో. భర్త బతికి ఉన్నన్ని రోజులూ వాకిలి ముఖం చూసి ఎరుగదు. ఎలిమెంటరీ ఉపాధ్యాయుడే అయినా చాలీచాలని జీతంతోనే కష్టంగా జీవించారు.

భగవంతుడు నిర్దయుడు. మశూచి వచ్చి భర్త పోయాడు పిచ్చితల్లికీ వచ్చింది. కాని ఆ మహామారి ముఖం నిండా తన గుర్తులనివేసి మెల్లగా జారుకుంది. ఆ సమయంలోనే ఎడమకన్ను పువ్వు వేసేసింది. భర్తపోయిన తరువాత ఇన్ని సంవత్సరాలు ఒక్క కన్నుతో ఒంటెత్తు జీవితం గడుపుతూ కొడుకుని అలా పైపైకి ఒక్కొక్క మెట్టూ ఎక్కించి ఇంతవాడిని చేసింది.

పిచ్చితల్లికి ఈ ఆనందసమయంలో తన గత జీవితం కళ్ళకి కట్టినట్లయింది. అదంతా అలా అలా తేలిపోయి ప్రస్తుత స్థితి గుర్తువచ్చి, అసలు ఏంచెయ్యాలో, ఏంచెయ్యకూడదో తోచక వాకిలి తలుపు మూయడంకూడా మరచి లాయరు రంగనాథంగారి ఇంటికి పరుగుతీసింది. ఆయాసపడుతూనే విషయం అంతా సుందరమ్మతో ఏకరువుపెట్టింది.

"అమ్మా, నే నిప్పుడు ఏంచెయ్యను? ఇదిగో, పిల్ల ఫోటో కూడా తెచ్చాడు ఆయన" అంటూ ఫోటో అందించింది.

సుందరమ్మ ఆ ఫోటోని పరీక్షగా చూసి బిగ్గరగా నవ్వుతూ, "నిన్ను నేను వెర్రిదానినై అన్నానా 'పిచ్చితల్లీ!' అని. కాకపోతే పిలిచి 'పిల్లనిస్తా' అంటూ లక్షాధికారి నట్టింటికివస్తే ఏదో కొంప మునిగినట్లు అలా ఒకే కంగారు పడిపోతా వేమిటే? పిల్ల చూడు బంగారు బొమ్మలా ఉంది. పెద్దపెద్ద కళ్ళు. కోటేరేసినట్లు ముక్కూ—"

అవేవీ తలకెక్కడంలేదు పిచ్చితల్లికి. తల వంచి ఆలోచిస్తూంది.

సుందరమ్మ గబగబా మరోసారి నవ్వేసింది.

"పిచ్చితల్లీ, ఎందుకా ఆలోచన! వాళ్ళు శ్రీమంతులనేగా నీ భయం! కోడలు నీ యింటికి వస్తుందిగాని, మీవాడు ఇల్లరికం వెళ్ళడుగా!"

ఇల్లరికం మాట వింటూనే పిచ్చితల్లి వెర్రిగా

చూసింది. తల అడ్డంగా తిప్పుతూ, "చస్తే ఇల్లరికం పంపను కాని...వియ్యానికీ, కయ్యానికీ సమ ఉజ్జీలుగా ఉండాలంటారుగదా, అమ్మా! మాదేమో సామాన్య సంసారం. ఆ పిల్ల ఆగర్భ శ్రీమంతురాలు. ఆ తరువాత ఎలా మారుతుందో!" అంది.

సుందరమ్మ నమిలే తమలపాకులు గభాలున మింగేసి, "నీ వింకా పాతకాలంమాటలు మాటాడితే ఎలా! ఇప్పుడు పిచ్చితల్లి వంటలక్క కాదు, కలెక్టరుగారితల్లి. అది దృష్టిలో పెట్టుకుని ఆలోచించి జవాబివ్వటం ధర్మం" అంది.

సుందరమ్మ కలెక్టరుగారి తల్లి అంటూంటే చచ్చేంత సిగ్గు అనిపించి తల వంచుకుంది పిచ్చితల్లి.

"ఇదిగో, నే చెప్పేది విను. అబ్బాయి రేపు ఎలాగూ వస్తాడు. ఇద్దరూ వెళ్ళి పిల్లని చూడండి. ఆపైన ఏం చెప్తే బాగుంటుందో అతన్నే నిర్ణయించమను. పిల్ల ఎలాగూ బాగున్నట్లేకదా?"

ఈ సలహా బొత్తిగా నచ్చలేదు పిచ్చితల్లికి.

"ఆ, వాడికేం తెలుసూ! మంచీ చెడ్డా మనం ఆలోచించాలిగానీ" అంది సాలోచనగా—

"పిచ్చితల్లీ, నీ పిచ్చి ఆలోచనలు కట్టిపెట్టు. కాలం చాలా మారిపోయింది. దానితోపాటు పిల్లలూ మారిపోయారు. ఇంక మారవలసింది మనలాంటి పెద్దవాళ్ళు. తెలిసిందా? వెళ్ళు. పెళ్ళి పిచ్చన్నకి ఉత్తరంరాయించు. అసలు

ఈ రోజో, రేపో అతనే ఎలాగూ వస్తాడనుకుంటాను. ఇదిగో, మనలో మన మాట. వాళ్ట్లోకి వచ్చింది మహాలక్ష్మి. కాదనటం ఏమంత తెలివైన పనికాదు. ఈ కాలంలో డబ్బు ఎంత ముఖ్యమో హోదా కూడా అంత ముఖ్యమే. డబ్బు వాళ్ళకుంటే, హోదా నీకుంది. ఏమంటావ్?" సుందరమ్మ నిలదీసి ప్రశ్నించింది.

"ఏమిటో...నాకేం అర్థం కావటంలేదు. అబ్బాయి వస్తాడుగా" అంటూ లేచింది పిచ్చితల్లి.

## 2

కొడుకు ఉద్యోగం ఆర్డరు వస్తూనే ముందు తల్లిచేసే వంటపని మాన్పించేశాడు. పధ్నాలుగు సంవత్సరాల అలవాటు ఒక్కసారి మానాలంటే కాస్త కష్టం అనిపించినా కొడుక్కి బాధ కలిగించటం ఇష్టంలేక ఆ పని మాన్పించేసింది. వంట మానేసినా రోజుకో సారన్నా రంగనాథగారి యింటికి వెళ్ళి వస్తేనేగాని, తోచదు పిచ్చితల్లికి.

కష్టపడుతున్నప్పుడు రోజూ దేవుడిని ఇలా ప్రార్థించేది—"నా పిచ్చన్నకి బ్రతుకు తెరువు చూపించి నన్ను గట్టెక్కించు" అని. భగవదనుగ్రహంవల్ల అన్నీ కలిసివచ్చి కొడుక్కి ఉద్యోగం వచ్చిందని తెలియగానే తల్లితో,

'అమ్మా, నీవు ఆ వంటపని మానేయి' అన్నప్పుడు ఆ క్షణాన సంతోషంతో ఉప్పొంగిపోయింది. కాని ఇప్పుడు

ఒక్క పావుశేరుబియ్యం ఉడకేసుకుని రోజ స్తమానం చేతులు ముడుచుకుని కూర్చోవాలంటే చాలా బాధగానే ఉంది. క్రమేపీ ఇలా కూర్చోవటం కూడ అలవాటు చేసుకోవాలి. కాబోలు అనే ఆలోచన వచ్చి ముసిముసినవ్వు నవ్వుకుంది పిచ్చితల్లి.

సుందరమ్మ ఇచ్చిన సలహా నెమరువేసుకుంటూ ఇల్లు చేరింది పిచ్చితల్లి. పోస్టుమన్ వాకిట్లో గిరాటువేసిన కార్డు ఇటూ అటూ తిప్పి పక్క యింట్లో చదువుకుంటున్న పిల్లాడితో పదిసార్లు చదివించుకుంది.

“ఇల్లు కుదిరింది, రేపు వస్తున్నాను” ఇదీ సారాంశం.

‘నా తండ్రి వస్తున్నాడు, నన్ను తీసుకువెళ్ళేందుకు. తరవాత ఏమన్నా కానీయ్ - పిల్ల చూడటానికి బాగానే వుంది చూసి రమ్మంటాను’ అనుకుంటూ కొడుకూ, కోడలూ, నట్టింట్లో పాపాయిలూ, తను వాళ్ళతో సంతోషంగా ఎంతకాలం గడుపుతుందో అని ఏవేవో ఊహలతో సంతృప్తిగా కళ్ళు మూసుకుంది.

## 3

“భాగ్యవంతులపిల్ల మనలో కలుస్తుందో, లేదో? వద్దమ్మా” అంటున్నా, “కాదులే. అసలు చూసిరా” అంటూ బలవంతంచేసి పంపింది పిచ్చితల్లి.

పిచ్చేశ్వరరావు పద్మప్రియని చూసివచ్చిన తరవాత

మాత్రం వద్దులే అనే పదం వదిలేసి, "నీ ఇష్టమమ్మా" అంటూ తప్పించుకున్నాడు.

పిచ్చి నాయనా! కొడుకు అభిప్రాయం తను అర్థం చేసుకోలేదూ?

"ఏమంటావు, కల్లెమ్మా!" అంటూ రానే వచ్చారు పార్థసారథిగారు.

"మీ ఇష్ట ప్రకారమే కానివ్వండి, అన్నగారూ! నాకూ ఒక్కగానొక్క కొడుకు."

అంటూ కళ్ళలో కదిలిన నీటిపొరని పమిటతో అద్దుకుంది.

"చాలమ్మా! ఆ మాట చాలు. నీకూ ఒక్క కొడుకు. మరి నాకూ ఒక్క రేగా కూతురు? ఇదిగో, వివాహం విషయంలో పెట్టుపోతల్లో నా శక్తి ఉన్నంతలో ఏ లోటూ రానివ్వను. శాస్త్రిగారితో మాట్లాడి లగ్నం ఖాయం చేస్తాను.

అబ్బాయి నక్షత్రం అదీ పంపిస్తారుగా? లగ్నం వీలున్నంత త్వరలో పెట్టేసుకుందాం ఇదిగో, ఈ పదివేలూ ఉంచమ్మా. రేపు మరో అయిదువేలు తెచ్చి ఇస్తాను. మీకూ అవసరాలు...ఖర్చు" అంటూ కొత్త నోట్లకట్ట తీసి అందించాడు.

పిచ్చితల్లి కళ్ళు క్షణం చీకట్లు కమ్మాయి

'తన జీవితంలో ఇలాంటి వందరూపాయల కట్టలు సరికొత్తవి ఎన్నడూ చూసి ఎరగదు. వట్టి ఒకట్లూ పదులూ

సంపాదించటానికే తన శరీరంలోని రక్త మాంసాలు హరించిపోయినాయి. ఎన్ని సంవత్సరాలు సంపాదించినా కనీసపు అవసరాలే తీరేవికావు అబ్బ. ఎన్ని కొత్తనోట్లు! ఇవన్నీ లెక్కపెట్టటంకూడా సరిగ్గా రాదు. పిచ్చన్న వచ్చిన తరువాత సరిగ్గా లెక్క పెట్టించాలి. ఇలా' ఆలోచిస్తూనే అందుకుంది.

సరికొత్త నోట్లని చేతితో స్పృశిస్తూ ఉంటే అదో విధమైన ఆనందంగా ఉంది. డబ్బు...డబ్బు! ఈ డబ్బు లేక పిచ్చికి ఫీజు కట్టడానికి ఒక్కొక్కసారి ఎంత కష్టాలు పడిందీ కళ్ళలో మెదిలింది. ఇప్పుడు ఆ కష్టాలు గట్టెక్కి నాయనుకో.

'ఇంతకీ ఈ డబ్బుతో ఏం చేయాలి?

కోడలికి నగలూ, చీరెలూ కొనవద్దూ? అలా కొనేవి మన డబ్బుతో కొనాలి గాని వీరిచ్చిన దాన్ని పెట్టి కొనటం ఏమిటి? అసలు ఈ డబ్బు ఈయన ఎందుకిచ్చినట్లు?' తీవ్రంగా ఆలోచించింది పిచ్చితల్లి.

"ఎందుకేమిటి నీ ముఖం! వరకట్నం క్రింద అడ్వాన్సుగా ఇచ్చాడు. మరో కొంత తరువాత ఇస్తాడు" మనస్సు విడమరిచి చెప్పింది.

అప్పటివరకూ ఉన్న హుషారు నీరుకారి పోయింది పిచ్చితల్లికి.

పార్థసారథి చేతి కర్ర ఊగిస్తూ, "చెల్లెమ్మా, మళ్ళీ కలుస్తాను" అంటూ వెళ్ళి కారులో కూర్చుని తలుపు వేసుకున్నాడు.

అలవాటు ప్రకారం వాకిలివరకూ సాగనంపటానికి వచ్చిన పిచ్చితల్లి చేతిలోని నోట్ల కట్టలు నీరెండకి యింకా మెరుస్తున్నట్లున్నాయి.

కారు కదలబోతూంది. ఇరుగూ, పొరుగూ పిచ్చి తల్లినీ, ఆమె చేతిలోని నోట్ల కట్టలనీ మార్చి మార్చి అసూయగా చూస్తున్నారు. ఇదేదీ గమనించే స్థితిలో లేని పిచ్చితల్లి మేఘ వేగంగా పనిచేస్తూంది.

కారు మెల్లగా కదిలింది. పిచ్చితల్లికి ఒళ్ళంతా చెమటతో తడిసిపోయింది. ఆవేశంతో - "అన్నగారూ, నాకీ డబ్బు వద్దు తీసుకువెళ్ళండి" అంది.

పార్థసారథిగారి ముఖం ఒక్క క్షణం కుమిలిపోయి నట్లయింది.

పిచ్చితల్లి కారులోకి విసిరేసిన డబ్బు ఉత్తరీయం కొంగులో చుట్టుకుని మళ్ళీ లోపలికి వచ్చి, "ఇదేమిటి, చెల్లెమ్మా! నేనింకా మిగతాది పంపిస్తానని చెప్పానుకదూ? పోనీ, నేనిచ్చేది చాలకుంటే మీకెంత కావాలో చెప్పా- తూగ గలిగితే" అని ప్రాధేయపడుతూంటే పిచ్చితల్లి కంగారు పడిపోయింది.

"అహహా, అదికాదు. మాకు మీ రిచ్చే డబ్బు వద్దు" ఎలా చెప్పాలో తెలియక అనేసింది.

"అంటే అర్థం? "నా పద్మని నీ కోడలుగా చేసుకోను" అంటావు. అంతేనా?"

5222
శ్రీకాకుళం



"అదికాదు, అన్నగారూ! మీ రిప్పుడిచ్చే డబ్బు వరకట్నంగానేగా? చూడండి. తండ్రి పోయేటప్పటికి ఇంత వాడు. అప్పటినించీ నా శక్తిని ధారపోసి ఇంత చేసింది అమ్ముకోవటానికి కాదు. పద్మ మా ఇంటి కోడలు కావటానికి, ఈ డబ్బు నేను తీసుకోక పోవటానికి సంబంధం లేదు. మీరు నిశ్చింతగా లగ్నం పెట్టించండి."

'అమ్మయ్య!' అనుకుంటూ పట్టిన చెమట ఉత్తరీయంతో తుడుచుకుంటూ మనస్సులో-'ఈమె వంటలక్క-కాని ఈమెలోని ఔన్నత్యం!' అంటూ విస్తుపోయారు పార్థసారథిగారు.

ఈ రోజుల్లో డబ్బుకి ఆశపడని వాళ్ళు కనిపిస్తున్నారా!

మూడు తరాలకి సరిపడ మూలుగుతున్నా ఇంకా సంపాదించి మూట కట్టాలని తాపత్రయపడే శ్రీమంతులు!

ఈమెకి డబ్బు విలువ అందరికంటే ఎక్కువే తెలుసు! కాని దానికి మించి ఆత్మాభిమానం అమూల్య సంపద అని గుర్తించే దాన్ని పోగొట్టుకోకుండా కాపాడుకుంటున్న ఆ స్త్రీ మూర్తిలోని ఔన్నత్యానికి నమోవాకాలు అర్పించటం కంటె మరేం చెయ్యలేక ఆనందాశ్రువులని తుడుచుకుంటూ, "చెల్లెమ్మా, నా బిడ్డ చాలా అదృష్టవంతురాలు. ఇంతకి మించి మరేం చెప్పను" అంటూ కదిలి వెళ్ళిపోతూంటె వాకిట్లోనే ఎదురైనాడు పిచ్చేశ్వరరావు. పార్థసారథి గుండె కాసేపు ఆగి తిరిగి కొట్టుకుంది.

'ఈ సంభాషణ అతను వినే ఉంటాడా' అనే సందేహం ఆయన్ని పీడిస్తూనే వుంది. పిచ్చితల్లి నిశ్చలంగా నిలిచి వుంది.

కాబోయే అల్లుడితో రెండు మాటలు మాట్లాడి వెళ్ళిపోయారాయన.

'కొడుకు పెళ్ళిలో ఏ యే ఏర్పాట్లు ఎలా ఎలా చేయాలో సుందరమ్మగారిని అడగాలి' అనుకుంటూ చెక్కిట చెయ్యి చేర్చి ఆలోచిస్తున్న తల్లి దగ్గరగా వచ్చాడు పిచ్చేశ్వరరావు.

"అమ్మా...మా అమ్మ పిచ్చితల్లి కాదు, బంగారు తల్లి. నే నెంత గర్వపడే పని చేశావమ్మా!" అంటూ తల్లి కాళ్ళ దగ్గర కూర్చుండిపోయాడు.

"ఏమిటిరా, పిచ్చీ!" అంటూ ప్రేమగా తల నిమిరింది.

"ఏమని చెప్పను! జీవితంలో నన్ను ఇంత ఉన్నత స్థితికి తేవటానికి అట్టడుగున నీ..."

"ఆఁ ఎప్పుడూ అలాగే అంటావు. నే కాదురా... పిల్లలని కన్న ప్రతి తల్లీ, ప్రతి తండ్రీ చేసే పని ఇదే."

"కాదమ్మా...కాదు."

అంటున్న కొడుకుని చూసుకుంటూ ఉంటే మహా గర్వంగా అనిపిస్తూంది పిచ్చితల్లికి. "ఆఁ నాదేముంది! అంతా ఆ దేవదేవుడి దయ" చేతులెత్తి నమస్కరించింది.

# 4

పార్థసారథిగారు ఆకాశం అంత పందిరీ, భూమి అంత అరుగూ వేసి కూతురు పెళ్ళి బ్రహ్మాండంగా జరిపించారు.

రంగనాథంగారూ, సుందరమ్మా విశ్వేశ్వరరావు తరఫు మగ పెళ్ళివారు. పెళ్ళి అయిన వెంటనే విశ్వేశ్వర రావు పద్మప్రియనీ, తల్లినీ తన ఉద్యోగం ఊరుకి తీసుకు వచ్చాడు. చక్కటి బంగళా, చుట్టూ అందమైన తోటా, బంగళాకి మూడువైపులా వరండాలూ, బెడ్ రూమ్, డ్రాయింగ్ రూము, గెస్టు రూము, స్టోరు రూము, ఇలా అన్ని సౌకర్యాలూ ఉన్నాయి ఆ ఇంటికి వంట మనిషి, పని మనిషి, ముగ్గురు నౌకర్లూ కొడుకుకోసం వచ్చేవారూ పోయేవారూ, అంతా బాగానే ఉంది

ఇక్కడికి వచ్చిన దగ్గరినించీ కొడుక్కి తల్లితో మాట్లాడే సావకాశమే లేదు. అందుకే ఉదయం కాఫీ తాగేప్పుడు తల్లి దగ్గర కూర్చుంటాడు. ఇంక రాత్రి పడుకోబోతూ,

"అమ్మా, ఫలహారం చేశావా? నిద్రపోతున్నావా?" అంటూ వచ్చి కాసేపు కూర్చుని వెళ్ళిపోతూ తల్లికి రగ్గు సరిగా కప్పి వెళ్ళిపోయేవాడు. కొడుకు కాంపులకి వెళ్ళి నప్పుడు పిచ్చితల్లికి అసలు ఏం తోచదు. కోడలు ఎప్పుడూ తన గదిలో ఏదో ఒకటి చదువుతూనో, రేడియో వింటూనో

కాలం గడిపేస్తుంది. లేకుంటే, క్లబ్బు స్నేహితులు వస్తూ ఉంటారు ఆ వచ్చిన వాళ్ళు పిచ్చితల్లితో ఒక్క మాట మాట్లాడరు. ఎగాదిగా ముఖంలోకి చూసి వెళ్ళిపోతూ ఉంటే పిచ్చితల్లికి ప్రాణం గిజగిజలాడుతుంది 'ఎందు కలా చూస్తారు? ఏమిటా గుసగుసలు? నేనూ వీళ్ళలాటి మనిషిని కానూ?' అనుకుంటుంది. వాళ్లు మాట్లాడితే ఎంత బాగుండును అనే ఉద్దేశ్యం హరించిపోయి, ఇంక తనకి కాలక్షేపం ఇంట్లోని నౌకర్లు అనుకొంది. వాళ్ళతో మాట్లాడుతున్నా పద్మ రెండు మూడు సార్లు కేకలు పెట్టింది.

"పనీ పాడూ లేదూ - ఏమిటా రాచకార్యాలు? వెళ్ళండి" అని.

ఇంక కొడుకు తనకోసం కొని ఇచ్చిన పుస్తకాలు ఎవరు చదివి వినిపిస్తారు?

కాలం ఎవరికోసమూ ఆగదుగా! తెల్లవారుతూంది. ప్రొద్దు గ్రుంకుతూంది. పద్మకి అత్తగారంటే తగని అసహ్యం. దీనికి కారణం - ఆవిడ వంటలు చేసి బ్రతికిందని ఒకటి. నల్లగా మోటుదేరిన చేతులూ, ఎండబారినముఖం, గుడ్డికన్నూ రెండో కారణం. తను కన్నెగా కన్న కల వీ ఒక్కటీ కాలేదు.

భర్త అందగాడూ, పెద్ద పదవిలో ఉన్నవాడూ, అవకాశం కల్పించుకుని ప్లేనులో తనని తీసుకుని ఫారిన్ వెళ్ళేవాడూ కావాలనిపించేది. అపైన తనని పిచ్చిగా ఆరాధించాలి. ఇంక అత్తగారూ, మామగారూ - అత్తగారు పచ్చని పసిమిరంగులో ఇంత వెడల్పు జరీ చీరెలో రవ్వల

దుద్దులతో అపర లక్ష్మిలాగ ఉండాలి. ఇంక మామగారు ఏ రిటైర్డు జడ్జినో అయి, సాయంకాలాలు అలా చేతికర్ర ఊపుకుంటూ షికారు వెళ్ళి వచ్చి గార్డెనులో కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ ఉంటే, తన స్నేహితుల కెవరికన్నా పరిచయం చేసినా ఎంత బాగుంటుంది! కాని, ఈ అవ తారం...ఛీ...దరిద్రపు అత్తగారు. ఇంక ఆయన రూపు సరేసరి. పెళ్ళిచూపుల నాడు సూటులో బాగానే ఉన్నా డులే, ఫర్వాలేదు అనిపించి తండ్రికి సరే అని తలవూపింది.

ఈయన అచ్చంగా తల్లి పోలికని తెలిస్తే ఛస్తే ఒప్పుకునేది కాదు. సూటులో బాగుంటాడు కాని ఇంట్లో పంచె కట్టుకుని బనీను వేసుకుంటె అసహ్యంగా ఉంటుంది. ఖర్మ...ఖర్మ! అసంతృప్తి పెరుకుపోతూంది పద్మలో. ఈ అసహనం అవకాశం దొరికినప్పుడల్లా అత్తగారిమీదికి విసుర్లు విసురుతుంది. ఆవిడ బాధపడుతూంటె ఆనందం తనకి.

పిచ్చితల్లి ఇవన్నీ పెదవి కదపకుండా భరిస్తూంది.

కొడుక్కి ఇలాంటి విషయాలు ఏం చెపుతుంది? ఎలా చెబుతుంది?

'అసలే పౌరుషం పిచ్చన్నకి. నే చెప్పగానే వెళ్ళి భార్యని ఏమన్నా చేస్తే...వద్దు...నేనే భరిస్తాను' అనుకుని మింగేస్తుంది. నౌకర్లుకూడా మాట్లాడడానికి వీలులేదని శాసించేసింది. ఒక్క వంటాయన మాత్రం పద్మ మాట ఖాతరు చెయ్యడు.

"ఏం చేస్తున్నారు, పెద్దమ్మగారూ! అయ్యగారు తెచ్చిన పుస్తకం చదివి వినిపించమంటారా?" అంటూ తన ఖాళీ టైములో కబుర్లు చెప్పి తన కుటుంబ విషయాలూ, ఊరులోని వార్తలూ చెప్పి పుస్తకం కాసేపు చదివి వినిపిస్తాడు. పద్మకి ఒళ్ళు మండిపోతుంది.

"కుక్కని తీసుకువెళ్ళి అందలంలో కూర్చోపెడితే కుచ్చులన్నీ కొరికేసిందట. అయినా వంట చేసుకుని బ్రతిడకి అంతస్థులెలా తెలుస్తాయి! దరిద్రంలో పుట్టి దరిద్రంలోనే పెరిగి...ఛీ...ఛీ..." ఇలా ఇంకా ఏవేవో అనబోతున్న పద్మప్రియ ఉలిక్కిపడి వెనక్కి తిరిగింది. భర్త ఎప్పుడు వచ్చాడో తన మాటలన్నీ విన్నాడు. అతని ముఖం కంద గడ్డలా ఎర్రబడింది.

"ఎవర్ని ఉద్దేశించి నీ వన్నమాట!" కోటు సోఫాలోకి విసిరికొట్టి పద్మ దగ్గరగా వచ్చాడు. కిటికీలోనించి చూస్తే తల్లి కనిపించింది. వంట అతను కబుర్లు చెపుతున్నాడు.

భర్తని చూసికాస్త తడబడింది పద్మప్రియ. కాని తన మనస్సులోని అసంతృప్తి దాచుకోలేక బైటికి వెళ్ళ కక్కేసింది. అసలు తన అంతస్థుకీ, తన అందానికీ, తన ఐశ్వర్యానికీ ఈ సంబంధమా .. ఒక్క ఉద్యోగం, హోదా తప్పితే మరేం లేదు. దానికే ప్రలోభపడి ఆనాడు సరేనంది. కాని, ఈనాడు మనస్సుకి సంతృప్తి లేదు.

పిచ్చేశ్వరరావు కోపంతో చాచి చెంప పగిలేలా కొట్టాడు.

పద్మ తల గిర్రున తిరిగిపోయింది. భర్త ఇలా తనని కొడతాడని కలలోకూడా ఊహించలేదు. బుగ్గ ఎర్రగా కంది పోయింది. అసలే మోటుచెయ్యి కళ్ళనీళ్ళు కాలవలు కడు తూంటే పైకివెళ్ళి తన మంచంమీద పడపోయింది.

పిచ్చేశ్వరరావుకి అప్పటికి ఆవేశం తగ్గలేదు.

"అమ్మ విషయంలో ఏ కాస్తఅయినా అమర్యాదగా ప్రవర్తించావా— జాగ్రత్త..." అంటూ గబగబా క్రిందికి వెళ్ళిపోయాడు.

తనని ప్రాణంగా ప్రేమించే భర్త ఇలా చేస్తాడనీ ఎలా అనుకుంటుంది? 'కాదు, వాళ్ళ అమ్మే ఎక్కువ. ఆ తరువాతే నేను. నే ఛస్తే ఈఇంట్లో ఒక్కక్షణం ఉండను.' ఆ రాత్రి నిద్రపోలేదు. పిచ్చేశ్వరరావు బ్రతిమలాడలేదు. దీనితో మరీ మండిపోయింది

ఈ మోటు మనిషికి నా విలువ ఏం తెలుస్తుంది? మోసపోయింది. భర్తని ఆఫీసుకి వెళ్ళనిచ్చి రైలు ఎక్కేసింది.

## 5

కూతురు కాపురం ఎలా కుదుటపడుతుందో తల బ్రద్దలు కొట్టుకున్నా అర్థం కాలేదు పార్థసారథిగారికి.

పేదవాడు, వెనక తల్లి తప్ప మరెవ్వరూ లేరు. ఉద్యోగం ఈ ఊరికే మార్పించుకుంటే ఇల్లరికం అల్లుడిని చేసుకోవచ్చని ప్లాను వేస్తే అది బెడిసి కొట్టింది.

భయం భయంగానే అల్లుడితో ఈ విషయం ఒకసారి ప్రస్తావించారు ఆయన. పిచ్చేశ్వరరావు తొణకకుండా చెప్పేశాడు— "అసంభవం" అని.

పద్మ దుఃఖం చెప్పతరం కాదు.

"చూశావా, నాన్నా! పెళ్ళిముందే ఇవన్నీ మాట్లాడమంటే— 'ఆఁ ఎక్కడికి పోతారు మన డబ్బు వదిలి' అంటివే... ఇప్పుడు?"

భర్తతో ప్రతిరోజూ తగువుకి దిగేది- "మీకు మీ అమ్మ ఎంత ముఖ్యమో, నాకు నాన్న అంతకు రెట్టింపు అంటూ. పిచ్చేశ్వరరావు చాలా తేలిగ్గా తీసిపారేస్తూ, "అలా అయినప్పుడు పెళ్ళి చేసుకోకుండా ఉండవలసింది. లేకుంటే ఇల్లరికానికి ఇష్టపడ్డ వాడిని కట్టుకుంటే సుఖపడేదానివి. నాలాంటి వాడిని ఎందుకు చేసుకున్నట్లు?" అనేవాడు.

ఇంక జవాబివ్వలేదు పద్మ.

తండ్రి ఇంటికివచ్చి భర్తకి ఉత్తరంకూడా రాయలేదు.

పిచ్చేశ్వరరావు మాత్రం మామగారికి వ్రాశాడు. "మీ అమ్మాయి మీ ఇంటికి సుఖంగా చేరిఉంటుందని తలుస్తాను" అంతే ఆ ఉత్తరం సారాంశం. మూడు నెలలు గడిచినా ఇద్దరిలో ఏ ఒక్కరి పట్టుదలా సడలలేదు. ముందు ఎవరు తగ్గాలన్నదే సమస్య.

"ఇక్కడికి బదిలీ అయితేనే!" అంటుంది పద్మప్రియ

ఒంటరితనం భరించటం కష్టంగా ఉంది పిచ్చేశ్వర రావుకి. పద్మలేని ఇల్లు బోసిపోతూంది.

పిచ్చితల్లికి కోడలు ఎందుకలా హఠాత్తుగా వెళ్ళి పోయిందో ఎంత ఆలోచించినా అంతుపట్టలేదు చూసిచూసి విసుగెత్తి కొడుకుని వెళ్ళి పద్మని తీసుకురమ్మని పోరు మొదలు పెట్టింది.

పిచ్చేశ్వరరావు ఏదేదో చెప్పి తప్పించుకో జూచాడు. కాని తల్లి వదల్లేదు.

"కోడలు వచ్చేవరకూ పచ్చి గంజికూడా ముట్టను" అని కూర్చుంది. మరి బయలుదేరక తప్పలేదు పిచ్చేశ్వర రావుకి.

"పిచ్చితల్లి — అమ్మకేం తెలుసు వాళ్ళకి ఎంత అహంభావం ఉందో! ఇప్పుడు నేనుగా వెడితే వాళ్ళకి ఎంత తేలికో... అమ్మకోసం తలవంచక తప్పదు."

ఉత్తరం పత్రం లేకుండా హఠాత్తుగా వచ్చిన అల్లుడిని చూస్తూనే- 'రాక ఎక్కడికి పోతాడు!" అనుకుంటూ గుబురు మీసాల్లోంచి వంకరనవ్వు నవ్వుతూ, "అమ్మా, పద్మా! అల్లుడొచ్చాడమ్మా... ఒరే, రంగన్నా! అల్లుడి కోటూ, బూటూ విప్పండిరా. రాజమ్మా ముందు నంబర్ వన్ కాఫీ పట్రా" అంటూ హడావుడి చేస్తూన్న మామ గారిని గమనిస్తూ సోఫాలో కూర్చున్నాడు పిచ్చేశ్వరరావు. రాత్రి తొమ్మిదిన్నర తరువాత సినిమాకి వెళ్ళిన పద్మ 'టక్ టక్' చెప్పులు చప్పుడుచేస్తూ వచ్చింది.

భర్తని చూస్తూనే మొదట ఖంగారు పడిపోయింది. తండ్రి ముఖంలోని భావాన్ని గ్రహించి తనూ చిరునవ్వు నవ్వింది పేపర్ చాటునుంచి ఇదంతా గ్రహిస్తూనే ఉన్నాడు పిచ్చేశ్వరరావు

"మీ అమ్మగారు కులాసాగా ఉన్నారా? నీకోసం పద్మ ఎంత బెంగపెట్టుకుందనీ" అంటూ కూతురు ఎంత దిగులుగా గడుపుతున్నదీ వర్ణించి చెబుతూంటే ఊఁ అనకుండానే వింటున్నాడు అల్లుడు.

పిచ్చేశ్వరరావు పడకగదిలో ఈజీఛెయిర్ లో పడుకున్నాడు రెండుచేతులూ కళ్ళకడ్డం పెట్టుకుని-

"మూడు నెలలకి గుర్తువచ్చానా?"

"......"

"మాట్లాడండి. ఇప్పటికి గుర్తువచ్చానా?" అతని క్రాపుని సవరిస్తూ ఎంతో మృదువుగా అడిగింది పద్మ. తలలోని మల్లెలు సువాసనలని గుభాళిస్తూన్నాయి. ఆమె రాచుకున్న సెంటు పిల్లగాలులకి సన్నని పరిమళాన్ని వెదజల్లుతూంది ఈ సమయంలో తను "నాకు గుర్తు రాలేదు. అమ్మ గుర్తు చేసింది" అనాలని నాలిక చివరివరకూ వచ్చిన మాటని మింగేశాడు, పద్మచేసే రాద్ధాంతం తెలుసు గనుక.

"ఇప్పటికైనా నాకే గుర్తు వచ్చావుకాని నీకు రాలేదుగా" అంటూ దగ్గిరికి లాక్కున్నాడు.

భర్త తనని గట్టిగా బంధించి తన కళ్ళలోకి కొంటెగా చూస్తూంటే పద్మ హృదయం పరవశించిపోతూంది. అతని

కళ్ళలోని వింత కాంతికి అచ్చెరువు చెందుతూంది. నల్లగా ఉన్నా, పొట్టిగావున్నా ఆ కళ్ళలో ఏదో తీవి తొంగిచూస్తూ ఉంటుంది. పదిమందిలో కూర్చున్నా అనామకుడులా కాక ప్రత్యేకంగా కనిపిస్తాడు ఇదే ఈయనలోని ఆకర్షణ. దీనికే తను లొంగిపోతుంది స్నేహితులు- "పద్మా, నీ మొగుడు చాలా తెలివిగలవాడు. లేకుంటె ఆ కరీక్ష ఎలా పాసవుతాడు? మొగతనపు తీవి కొట్టవచ్చినట్టు కనిపిస్తూంది కదూ" అంటూ ఉంటే గాలిలో అలా అలా తేలిపోతుంది. కాని కొన్ని విషయాలు అతనికి, తనకి బొత్తిగ నచ్చవు. "నేను ముందు కాదు, ఆయనకి వాళ్ళఅమ్మ ముందు. ఆ తరువాతే నా స్థానం" అన్నది గుర్తు వచ్చినప్పుడల్లా అసూయతో వేగిపోతుంది.

పిచ్చేశ్వరరావు పద్మ ముఖాన్ని దగ్గరగా లాక్కొని అడిగాడు. "ఇన్ని రోజులు ఎలా ఉన్నావు?"

పద్మ ఆలోచలు వేగంగా ఉన్నాయి. 'భర్త సూటులో ఉండగా ఎంత బాగుంటాడు! పంచ కట్టుకున్నప్పుడు ఏం బాగుండదు. అలా అని ఇంట్లో వున్నప్పుడు కూడా ఎలా...?' ఇదే ఆలోచిస్తూంది.

పద తలలోని మల్లెలని వాసనచూస్తూ ఎడమచేత్తో లైటు స్విచ్ నొక్కేశాడు.

కిటికీలోనించి వెన్నెల తెల్లగా మెరుస్తూంది:

ఇద్దరూ మూడు నెలల ఎడబాటులో స్వల్పవిషయాలూ, స్పర్థలూ మరిచి ఆనందంగా గడిపేశారు.

# 6

తెల్లవారిపోయింది.

పద్మ బద్ధకంగా కళ్ళు తెరిచి మెల్లగా లేచి వెళ్ళబోతూంటే కళ్ళు మూసుకునే పమిట పట్టుకుని లాగి మరీ చెప్పాడు.

"ఈరోజే మనం వెళ్ళిపోవాలి. టికెట్లు రిజర్వు చేసేశాను. మీ నాన్నగారికి చెప్పు" అంటూ అటు తిరిగి పడుకున్నాడు.

పద్మప్రియ కాళ్ళక్రింద భూమి జరజరా జరుగుతున్నట్లయింది. రాత్రి భర్త వచ్చిన దగ్గరనుంచీ గమనిస్తూనే ఉంది ఏదో మార్పు. ఆ మార్పు తనని బాధ పెడుతూనే ఉంది. తండ్రి తన పలుకుబడిని అంతా వినియోగిస్తున్నాడు అల్లుడిని ఇక్కడికి రప్పించాలని.

'నన్ను పిచ్చిదాన్ని చేసి ఆడిస్తున్నాడు. అసలు రాత్రి మాట్లాడకుండా ఉంటే ఎంత బాగుండేది!' క్రిందికి వెళ్ళి తండ్రికి చెప్పేసింది. "అలాగా" అంటూ ఆలోచిస్తూ ఉన్నారు ఆయన.

భోజనాలూ అవీ యాంత్రికంగానే అయిపోయినాయి. రైలు టైము అవగానే తనే వెళ్ళి టాక్సీ తెచ్చి వాకిట్లో పెట్టి, "మామగారూ, పద్మను తీసుకు వెడుతున్నాను" అంటూ

చేతి గడియారం చూసుకుంటూ, "పద్మా, టైమయి పోయింది. జల్దీ రావాలి" అని త్వరపెట్టేశాడు.

పాంటు జేబుల్లో చేతులు ఉంచుకుని వరండాలో ఇటూ అటూ పచార్లు చేస్తున్న అల్లుణ్ణి మింగేయాలన్నంత కోపం వచ్చేసింది.

పద్మ ప్రొద్దుటినుంచీ రిహార్సలు చేసుకుంది.

భర్త "వస్తావా, లేదా?" అని అడిగితే ఎలా జవాబివాలో. కాని, కథ అడ్డం తిరిగింది. పిచ్చేశ్వరరావు టాక్సీ వాకిట్లోపెట్టిపిలుస్తున్నాడు. 'రాను' అని చెప్పలేదు. వస్తానని వెళ్ళలేదు. భర్త కోపంవస్తే ఎంత కఠినుడో బాగా అర్థం అయింది.

ఇప్పటికే స్నేహితులందరూ "ఇంకా ఇక్కడే వున్నావేం" అంటూ గేలిచేస్తున్నారు. కొందరు పద్మని మొగుడు వదిలేశాడని పుకారుకూడా పుట్టించారు.

ఒక పక్క తనది భవిష్యత్తు. ఒకవైపు తండ్రిని ఒంటరిగా వదలి వెళ్ళాలనే బాధ. ఏం చెయ్యాలేక వెక్కి వెక్కి ఏడుస్తూ ఉండిపోయింది.

పార్థసారధి ఆరోజు బాధపడ్డాడు. 'వెధవ సంబంధం చేసి పిల్ల గొంతు కోశాను. పేదవాడు గదా—ఇల్లరికం అంటే ఎగిరి గంతువేసి ఒప్పుకుంటాడనుకున్నాను. కాని భార్యని తాడువేసి లాక్కుపోతాడని అనుకోలేదు' అలా ఆలోచిస్తే ఈ "వంటదాని కొడుక్కి" ఎందుకిచ్చేవాడు?

ఏడ్చే కూతుర్ని ఓదారుస్తూంటే టైమయిపోయిందని

కోపంగా పిచ్చేశ్వరరావు పైకి వచ్చాడు. ఆ యిద్దరినీ చూస్తూంటే అతని కళ్ళు చెమర్చాయి.

"మామగారూ, పద్మ మిమ్మల్ని చూడాలన్నప్పుడల్లా పంపిస్తాను. దిగులుపడకండి. మరి నాకు మా అమ్మ ఉన్నదికదూ" అంటూ భార్యని చెయ్యిపట్టుకొని తీసుకువెళ్ళి కారులో ఎక్కించాడు.

"వస్తాం" అంటూండగానే టాక్సీ కదిలిపోయింది.

"పిచ్చి పద్మా! నీ యింటికి నీవు వస్తూంటే యింత దుఃఖమా! ఊఁ...కళ్లు తుడుచుకో...నీ చీరెల పెట్టె, మా నౌకరు డిక్కీలో పెట్టాడులే...మరి నువ్వు లేకుండా నేను వుండలేను. ఏదీ నువ్వు నవ్వాలి" ఇలా అంటుంటే పద్మకి మరీ దుఃఖం ముంచుకొచ్చింది.

# 7

జీపు దిగి ఇంట్లోకి వస్తున్న కోడలికి దిష్టితీసి పారేసింది ఓ ముత్తయిదువు. పిచ్చేశ్వరరావు ఇంటికి కావలసిన హంగులన్నీ ఒక్కొక్కటీ అమర్చుకున్నాడు.

"వంట నే చేస్తాగా, నాయనా" అన్న తల్లిని—
"ఊఁ ..అదంతా పనికిరాదు. కష్టపడ్డది చాలదూ? నీవింక పూ రిగా రెస్టు తీసుకోవాలి. కాలక్షేపం కాకుంటే సిటీలో ఏవో ప్రోగ్రాములు ఉంటాయి, వెళ్ళవమ్మా. ఎవరో

కాదు, పూరీ శంకరాచార్య ఉపన్యాసాలు ఇస్తున్నారట.
అక్కడికి వెళ్ళి కాసేపు ఉండిరా అమ్మా! నేనీరోజు త్వరగావచ్చి నిన్ను తీసుకు వెడతాను" అంటూ కొడుకు ఆఫీసుకు వెళ్ళిపోయాడు.

పిచ్చితల్లి కళ్ళలో మాతృగర్వం తొణికిసలాడింది.

'వెడతాను, వెళ్ళి ఆయన ఏం చెపుతారో వింటాను' అనుకుంది.

ఆరు కొట్టినా కొడుకు రాలేదు. పిచ్చితల్లి పిచ్చిదానిలా తిరుగుతూంది. ఏ కారు శబ్దంవిన్నా తన కొడుకే అని తొంగిచూస్తోంది. ఆరు అన్నవాడు ఏడు దాటిపోతున్నా రాలేదు.

'ఎన్నో పనులు. ఈ సంగతి గుర్తు ఉండవద్దూ. పెళ్లాం సినిమాకి వెడదాం అంటే మాత్రం గుర్తు ఉండి ఠంచనుగా వచ్చి వాలతాడు' మనలో ఏ మూలో ఉన్న అసూయ ఇంతింతై వటుడింతై అన్నట్లు మనస్సుని పూర్తిగా ఆక్రమించేసింది. నీరసపడిపోయి మంచంమీద పడుకుండిపోయింది.

"అమ్మా, అమ్మా!" బిగ్గరగా వినిపించింది పిచ్చేశ్వరరావు గొంతు.

తన ఆలోచనలో కొడుకు ఎప్పుడు వచ్చాడో గమనించనేలేదు.

"ఆలస్యం అయిపోయింది. రా, అమ్మా! ఆఫీసులో

ఏదో అర్జెంటు పని పగిలింది" అంటూ తల్లిపక్కన కారులో కూర్చున్నాడు.

"అబ్బ, తలనొప్పిగా ఉంది. అదీకాక మళ్ళీ తెల్ల వారుఝామునే కాంపుకి వెళ్ళాలి. నీవు కానీపు కూర్చో, అమ్మా! నేను వెళ్ళి కారు పంపిస్తాను" అంటూ వెళ్ళిపో యాడు తను ఆలస్యంగా రావటంవల్ల స్వామివారి ఉపన్యా సం అయిపోయింది మరెవరో ఇలా ప్రార్థన చేస్తూవుంటే పిచ్చితల్లి నోరు తెరుచుకుని అలా వింటూ ఉండిపోయింది.

"వర్థతాం బ్రహ్మ విద్యాచ లోకేభ్య సుఖమేధతాం!
తపసా కిల్బిషం హన్తి విద్యయామృత మశ్నుతే!"

"ఓ కారుణ్యమూర్తి యగు పరమేశ్వరా! ఈ దృశ్య ప్రపంచ విషయములచే అనుదినం మోహింపబడక, సర్వా వస్థలయందూ మీ పాద పంకజములందు సంలగ్నమైన చిత్తమును, అనన్యమైన భక్తిని మా కనుగ్రహింపుము."

ఇలా వింటూండగానే టైము చాలా గడిచిపోయింది. అబ్బా - ఎన్ని విషయాలు చెబుతున్నారూ అనుకుని అందరూ వెళ్ళిపోతూంటే తనూ లేచి బయటికి రాగానే డ్రైవరు వచ్చి తీసుకువెళ్ళిపోయాడు.

మరుసటి రోజు పిచ్చేశ్వరరావు - "పని వుంది. రాత్రి ఆలస్యంగా వస్తాను" అంటూ వెళ్ళిపోయాడు. పిచ్చితల్లి ఈ రోజూ వెళ్ళింది.

అందరిలాగా తనూ అంతా విన్నది. రేపటినుంచీ

తప్పకుండా పూజా పునస్కారం మొదలుపెట్టాలి-అనుకుంటూ ఆఖరున బయటికి వచ్చింది. తనకోసం కారు లేదు; డ్రైవరూ లేడు ఎవరికివారు వెళ్ళిపోతున్నారు లైట్లు తీసేసి అక్కడి వాళ్ళు వెళ్ళిపోతూ అక్కడే నిలబడిఉన్న పిచ్చితల్లిని చూసి, “ఎవరండీ?” అంటూ దగ్గరగా వచ్చారు.

కొడుకు ఇంటిదగ్గర లేడు. ఉంటే తన స్థితి ఇలా ఉండేది కాదు కోడలు కారు పంపి ఉండదు ఈ చీకట్లో ఏం చెయ్యటం?

“మా అబ్బాయి...ఫలానా” అని చెప్పిందిగాని ఇంటి అడ్రస్ వివరంగా చెప్పలేకపోయింది.

“అయ్యో, వక్కర్తే, పాపం. పోనీ తీసుకువెడదామన్నా ఇల్లు తెలియదే” చివరికి ఆమెని ఎలాగైతేనేం ఇల్లు చేర్చారు.

పిచ్చితల్లికి దుఃఖం ముంచుకొచ్చింది. ‘వీళ్ళు లేకపోతే యీ రోజు నా గతి ఏం కానూ? అబ్బాయి ఇంటికి ఇంకా రాలేదులా ఉంది.’

ఇలాంటి అనుమానాలూ అవీ భరించటం తప్పటం లేదు పిచ్చితల్లికి కొడుక్కి చెపితే పర్యవసానం తనకి తెలుసు. కోడలు అసలు తనని ఎందుకు ఇంతగా ద్వేషిస్తున్నదో అర్థంకాదు.

ఒకరోజు పద్మ క్లబ్బు ఫ్రెండ్ జయలక్ష్మి ఆడబడుచు పెళ్ళి అత్తగారూ, తనూ పెళ్ళి పిలుపుకి వచ్చారు.

పద్మకి కుంకుమ ఇచ్చి, “మీ అత్తగారు ఎక్కడ?

ఆవిడకి కూడా చెప్పి వెడతాం" అంది జయలక్ష్మి అత్తగారు.

జవాబేం ఇవ్వలేదు పద్మప్రియ. జయలక్ష్మి అత్తగారు కామాక్షమ్మ రెట్టించింది - "ఏ గదిలో ఉన్నారమ్మా? పెద్దవారు-ఆమెనికూడా తప్పక రమ్మని చెపుతా" అని.

దొడ్డివైపు వరండాలో మంచంమీద పడుకుని 'గుర్రు' పెట్టి నిద్రపోతూంది పిచ్చితల్లి. నోటివెంట చొంగ కారుతూంటే ఒకటి రెండు ఈగలూ, దోమలూ ఆ దగ్గర ఎగురుతూ ఉన్నాయి. అత్తగారిని ఆ స్థితిలో చూస్తూవుంటే పద్మకి డోకు వచ్చినంతపని అయింది. వెంట తన స్నేహితురాలూ, ఆమె అత్తగారూ...ఛీ ఛీ! ఎంత అవమానం!

అలికిడికి లేచి కూర్చుని కళ్ళు, నోరు తుడుచుకుంటూ, "ఎవరు, పద్మా? ఓ...జయలక్ష్మా? కూర్చోండమ్మా" అంది ఊడిపోయిన నాలుగు వెంట్రుకలనీ ముడి వేసుకుంటూ.

జయలక్ష్మి స్టూలు లాక్కుని కూర్చుంది. కామాక్షమ్మ మాత్రం ఆ మంచంమీదే కూర్చుని, "అక్కగారూ! పెళ్ళికి మీరుకూడా తప్పక రావాలి" అంది.

పిచ్చితల్లి నవ్వి వూరుకుంది.

"పద్మప్రియా! మీ రీమెను తప్పకుండా తీసుకురావాలి" అంటూ మరీ మరీ చెప్పి, "వస్తాం మరి!" అంటూ వెళ్ళిపోయారు.

# ౮

టిప్‌టాప్‌గా ముస్తాబయి వచ్చిన పద్మప్రియ పక్కన అతి సామాన్యంగా కనిపించే యీమె "ఎవరూ?" అని ప్రశ్నించారు.

"మా అత్తగారు" అని చెప్పాలంటే తలకొట్టేసినట్లయింది. అయినా, వాళ్ళు వదులుతారా! పద్మ చెప్పినప్పటినించీ వెనక కూర్చున్న అమ్మలక్కలు ఒకటే గుసగుసలు.

పిచ్చితల్లి యిదేదీ పట్టించుకోలేదు.

చిలుకా గోరువంకల్లా ఉన్న నూతన వధూవరులనీ, ఆ పెళ్ళికి విచ్చేసిన అతిథులనీ విచిత్రంగా చూస్తూ ఉండిపోయింది ఈ ప్రపంచం యింత అందంగా వుంటుందనే సంగతి యింతవరకూ తనకి తెలియనే తెలియదు. 'సిరీ, సంపదా, సరస్వతీ' - ఈ మూడింటికీ పొత్తు కుదరదు కాని. ఈ మూడూ కలిసినప్పుడు ఆనందానికి కొదువ యేం వుంటుంది!

'అబ్బ, ఎంత బాగుందీ! అయ్యో, అదేమిటి ఆ అమ్మాయిలు పమిటలు అలాపడిపోయేటట్లు వేసుకున్నారు! ఈ అబ్బాయిలు ఉరేసుకున్నట్లు ఆ చొక్కాలేమిటీ! సన్నగా గొట్టాలకి తొడిగినట్లు ఆ పొడుగు లాగూలు ఏమిటీ... అయ్యో రాత!' అనుకుంది మనస్సులో. 'నలుగురిలో

తిరుగుతూ వుంటే ఒంటినిండా పమిట కప్పుకోవాలనే జ్ఞానం వుండదూ?' ఇవి పిచ్చితల్లి ఆలోచనలు. ఇవన్నీ యీనాటి ఫాషన్లని పాపం ఆవిడకేం తెలుసు!

నేను నిజంగా యిదంతా చూస్తున్నానంటే నా పిచ్చి నాయన చలవకదూ!

పిచ్చితల్లి వెనక కూర్చున్న ఓ అమ్మాయి చేతిలోని సంవత్సరం పాప పిచ్చితల్లి తలపట్టుకు లాగుతూంది. వెనక్కి తిరిగింది - "ఎవరూ" అని.

తన బోసినవ్వులతో పలకరించి చేతులు చాచింది.

బొద్దుగా అందంగా వున్న ఆ పాపని అందుకుంటూ, "పేరేమిటే?" అంది ముద్దుపెట్టుకుంటూ.

"తనూజ. మీ రెక్కడుంటారూ" అంటూ కబుర్లలోకి దిగిందామె.

"మా అబ్బాయి కలెక్టరు" అంది గర్వంగా పిచ్చి తల్లి.

"ఏమిటీ! మీరు ... కలెక్టరుగారి తల్లిగారా! చెప్పరూ" అంటూ అంతకుముందు కనిపించిన నిర్లక్ష్యాన్ని గభాలున వెనక్కినెట్టి అతిమర్యాదగా మాట్లాడేస్తూంది.

"మీ అబ్బాయిగారి ఆఫీసులోనే మా వాడూ పని చేస్తూ ఓ గొడవలో చిక్కుకున్నాడు. మీ అబ్బాయి చాలా సహాయపడ్డారండీ. ప్రతిరోజూ దీపం వెలిగించగానే మా కోడలు దణ్ణంముందు మీ అబ్బాయి పేరు చెప్పే

పెడుతుంది. ఎలాగయినా శాస్త్ర పెద్దవాళ్ళని ఒక కంట కని పెడుతా రాయన."

ఇంతలో ఆమె కోడలుకూడా దగ్గిరికివచ్చి నమస్కరించింది.

పిచ్చితల్లికి మహాసంతోషంగా వుంది. "ఓహో... అలాగా" అంటూ మురిసిపోతూంది. ఈ సంతోషంలో యెదటివాళ్ళు అడిగిన తరవాతగానీ తన కోడలిని పరిచయం చేయాలన్నది గుర్తుకురాలేదు.

"మీ కోడలుగారెక్కడ?" అనేసరికి పిచ్చితల్లి చుట్టూ వెతుక్కుంది. అప్పటికే కోపంతో పద్మప్రియ ఆ చుట్టుపల్ల ఉండకుండా వెళ్ళిపోయింది.

అందరూవచ్చి "నమస్కారమండీ!" అంటూ ఉంటే యేమిటోగా వుంది. నమస్కరించటం అలవాటు కాని, అందుకోవటం అలవాటులేని పిచ్చితల్లి అసలు కుర్చీలో యెలా కూర్చోవాలో కూడా చేతకాక మెలికలు తిరిగిపోయింది. కూర్చోపెట్టి యెటో వెళ్ళిన కోడలు గంటపైగా అయినా వత్తాలేదు.

కోడలి ప్రవర్తన ఒకవేపు బాధ కలిగిస్తూంటే తన వెనకవాళ్ళ గుసగుసలు వినీ వినిపించక ఒళ్ళంతా మంట లెత్తుకొస్తూంది. అప్పటికి శాస్త్ర ముందు దొరికిన సంతృప్తి ఆవిరయిపోయింది. 'అందరూ నన్ను యిలా చూస్తారేమిటీ?

నా ముఖాన కోతు లాడుతున్నావయ్యా!' కోపం ఉక్రోషం కలగా పులగమయి ఆమె ముఖం ఎర్రబడింది.

"ఇంట్లో పడి ఉండక ఎందుకు వచ్చాను దేవుడా! మరెన్నడూ రాను" అంటూ చెంపలు వేసుకుంది. వెనక నించి నవ్వే నవ్వులు ఆమె వీపుని తూట్లు పరుస్తున్నాయి.

కామాక్షమ్మ పిచ్చితల్లిని వెతుక్కుంటూ వచ్చి, "వెళ్ళిపోయేరు సుమా... భోజనంచేసి మరీ వెళ్ళాలి. మీ కోడలికి చెప్పాను, అక్కగారూ" అంటూ మరీ మరీ చెప్పింది.

"కడుపు నిండిపోయింది. ఇంక భోజనం ఎందుకు?" అన్నా వినక పంక్తి ముందు కూలేసి మరీ వెళ్ళింది.

వడ్డన ప్రారంభమైంది. అందరూ వంటలు చాలా బాగున్నాయంటూ తింటున్నారు. వంటాయన సీనయ్యా, మహాలక్ష్మి పదార్థాలు కొసిరి కొసిరి వడ్డిస్తున్నారు. సీనయ్య నేతి జాడీ పట్టుకుని వరసగా వడ్డిస్తూ నెయ్యి వేయించు కుంటూ చెయ్యి అలాగే పట్టి తన ముఖంలోకి చూస్తున్న పిచ్చితల్లిని చూస్తూనే గురుపట్టి, "ఆఁ ఆఁ...నీవా... పిచ్చమ్మా! ... ఎన్నాళ్ళ కెన్నాళ్ళకి ... ఎక్కడ ఉంటు న్నావూ...నువ్వు మా ఊరు వదిలావు...మెత్తటి గారెలే కరువయినాయి. ఎంత మెత్తగా రుబ్బే దానివీ పిండి... ఆహా...అల్లం, పచ్చిమిరపకాయలూ, కొత్తిమెరీ ఎత్తుకెత్తు వేసి గారెలు వండితే వెనక్కి అసలు ఉండేవా...ఇంతకీ నీ

ఎక్కడున్నావూ ... మగపెళ్ళివారింటికి వంటకొచ్చావా! పిచ్చి రాజా ఎలాగున్నాడు!" అంటూ సీనయ్య నేతిజాడీ పట్టుకుని జరిగినవీ, జరుగుతున్నవీ, జరగబోయేవీ ఏకబిగిన ఏకరువు పెట్టేస్తున్నాడు; చాలా కాలానికి కనిపించిన స్నేహితురాలిని చూస్తూనే మతిపోయినవాడిలాగా.

పిచ్చితల్లికి కాస్త దూరంగా కూర్చున్న పద్మప్రియ వంకే చూస్తున్నారు అందరూ.

పద్మప్రియకు రోషం, అవమానం ముంచుకురాగా లేచి వెళ్ళి చెయ్యి కడుక్కుని కారులో ఇంటికి వెళ్ళి పోయింది.

పిచ్చితల్లి, సీనయ్యకి జవాబివ్వలేదు. తన కొడుక్కి ఎంత అప్రతిష్ఠ! ఓయి దేవుడా! జీవితం వెళ్ళదీస్తూ బిడ్డని పైకి తెచ్చేసుకోవాలనే తాపత్రయంతో మరింకేమీ చేసేందుకు చేతకాక ఈ వృత్తిని ఎంచుకుంది. కాని, ఈనాడు తనకి అన్నం పెట్టి కొడుకు భవిష్యత్తుని తీర్చిదిద్దిన ఆ వృత్తివల్లే అవమానాలపాలు కావలసివస్తుందని అప్పుడు ఏ కాస్త తెలిసినా చచ్చినా ఆ పని చేసేదికాదు.

'భగవంతుడా, ఏమి టిదంతా!' కళ్ళవెంట నీళ్లుతిరిగినాయి. కోడలు వెళ్ళిపోయినందుకు, చుట్టూ వాళ్లు నవ్వుతున్నందుకు...ఎన్నింటికి ఏడవను! తను కష్టాల్లో ఉండగా తోడబుట్టిన తోడుకంటే సహాయపడిన సీనయ్యతో ఒక్క మాట మాట్లాడలేకపోయానే అన్నది మరో బాధ.

కామాక్షమ్మకి విషయం అర్థమయింది.

"పిచ్చమ్మా, నీ కొడుకు పెద్ద చదువు చదివాడట!" అంటూ సీనయ్య ఏదేదో అంటూ ఉంటే జయలక్ష్మి ఏం చెప్పాలో తోచక బిగ్గరగా అరిచింది: "ఆవిడ కొడుకు ఇక్కడ కలెక్టరు. ఇప్పటికైనా నోరు మూసుకుని లోపలికి పోతావా, లేదా!"

"ఆఁ.. పిచ్చమ్మ కొడుకు కలెక్టేరా...ఓయమ్మో నాకు తెలవదే" అంటూ నేతి జాడీతో సహా లోపలికి పారిపోయాడు, తన తెలివి తక్కువతనానికి బాధపడుతూ. లేకుంటే ఇంకా ఎంత బాగుండేదో చూద్దాం అనుకుని ఆసక్తిగా చూశారు అక్కడివాళ్లు. చప్ప చప్పగా తేలి పోయింది ఆ సంఘటన.

"అక్కగారూ, ఈ కాలం పిల్లలంతా ఇంతే" అని కామాక్షమ్మ గారు ఎక్కిస్తున్నా, పిచ్చితల్లి మారుమాట చెప్పకుండా ఇంటికి వెళ్ళి తన పక్కమీద వాలిపోయింది. దుఃఖం కట్టలు తెంచుకుంది.

'వంటలు చేసుకుని బ్రతికినవాళ్లు తరతరాలుగా ఆ స్థితిలోనే ఉండాలా! కనీసం బిడ్డలనైనా మంచి స్థితికి తేవాలని ప్రతి తల్లీ, తండ్రీ తమశక్తిని ధారపోస్తారే! ఎవరు ఎన్ని అంటె నాకేం! నే చేసింది తప్పుకాదు. కాదు. నా పిచ్చి అర్థం చేసుకోగలదు. ఇంక ఈ ప్రపంచం ఏకమై నన్ను తేలిక చేసినా నేను లెక్క చెయ్యను. అంతే.'

దుఃఖాన్ని మింగేసి లేచి కూర్చుందే కాని, ఇంటికి కొడుకు రాగానే కోడలు ఏమని చెబుతుందో అని ఆరాటంగా వుంది. అయినా ఆలోచనలు వదలటంలేదు.

# 9

సాయంత్రం ఏడు గంటలు కావచ్చింది. కళ్లు మూసుకుంటే కాని నిద్ర రావటంలేదు.

నౌకరు గేటు దగ్గిర ఎవరితోనో ఘర్షణ పడుతూంటే వరండాలోనుంచి తొంగిచూసింది సీనయ్య గరిటెలసంచీ భుజాన వేసుకుని లోపలికి వెళ్ళనిమ్మని ప్రాధేయపడు తున్నాడు. నౌకరు వదలటంలేదు.

"పెద్దమ్మగార్ని ఒక్కసారి చూసి వెళ్ళిపోతా." అమాయకంగా కాళ్లు ఎత్తి లోపలికి చూస్తున్నాడు సీనయ్య.

"ఏం,వంటకి నీతోపాటు వస్తావండా!" పైకి మెల్లగా అనేసి సగం మింగేశాడు నౌకరు. పిచ్చితల్లి ఇదంతా చూస్తూనే వుంది.

"వెంకన్నా, రానివ్వు ఆయన్ని" బిగ్గరగా అరిచింది. సీనయ్యకి పది ఏనుగుల బలం వచ్చి వెంకన్నని తోసు కుంటూ లోపలికి పరుగెత్తుకు వచ్చాడు

ఇల్లంతా చూస్తూ పిచ్చి సంతోషంతో - "అబ్బో, పెద్ద బంగాళే! బాగుందమ్మా, చాలా బాగుంది" అంటూ హాలులో ఉన్న సోఫాసెట్టుని, ఫ్లవర్ వాజులోని పువ్వులని చేతో ముట్టుకుని చూస్తూ కబుర్లు చెబుతూనే గోడలూ, కిటికీలూ పరీక్షిస్తున్నాడు.

"రోజుకి ఎంత గిడుతోంది" అంది పిచ్చితల్లి తను.

వంటచేసే రోజులు గుర్తురాగా. ఆ రోజుల్లో ఒక రోజుకి అయిదు రూపాయలు. భోజనం, కాఫీ అక్కడే కనుక ఆ అయిదు రూపాయల కాగితం తెచ్చి అలాగే పెట్టె అడుగున దాచేసేది, కొడుకు చదువుకోసం.

సీనయ్య హుషారుగా చెప్పుకుపోతున్నాడు కూర్చోకుండానే.

"రోజుకి పదీ పరకా దొరుకుతున్నాయి. అదే పెళ్ళిళ్ళలో అయితే ఇరవై దాకా దొరుకుతోంది. నా మేనల్లుడున్నాడే-వాడిని చదివిస్తున్నాను. ఇప్పుడు బి. ఎ. రెండో వాడు బిడ్డమ్మా. నాలాగే గరిట పట్టుకోవలసిందే! ఆఁ పున్నమ్మ ఉండే, గుర్తుందా? ఆమె కూతురు ఇప్పుడు పంతులమ్మ చేస్తో తల్లిని ఈ పని మానిపించేసింది. వాళ్ళని చూస్తే నాకెంతో సంతోషం వేస్తోంది."

"అలాగా! ఆ సరోజ చదువుకి నీవు అప్పుడప్పుడూ సహాయం చేస్తూ ఉండేవాడివి కదూ! మా పిచ్చన్నకి ఎన్నోసార్లు సహాయపడ్డావు-నాకు గుర్తు వుంది" కాశ్మీరు శాలువా ఒంటినిండా కప్పుకుంటూ పిచ్చితల్లి మరోసారి కూర్చోమని హెచ్చరించింది సీనయ్యని. సీనయ్యకి కూర్చోవటానికి చేతకావటం లేదు.

సంతోషంతో ఏవేవో కబుర్లు చెపుతూనే వున్నాడు.

పిచ్చేశ్వరరావు ఆఫీసునుంచి వస్తూనే సరాసరి పై-వెళ్ళిపోయాడు. సీనయ్య చూడాలని తహతహలాడుతూంటే

"ఇప్పుడే వస్తాడు కిందికి. ఆఫీసు బట్టలు మార్చుకోవాలిగా" అంది.

పద్మ గబగబా జరిగిన అవమానం ఏడుస్తూ చెప్పేసి, "ఇదంతా చాలక ఆ వంటవాడు మీ అమ్మకోసం మన ఇంటికే వచ్చేశాడు. అరగంటనించీ ఒకటే కబుర్లు! నౌకర్లు ఒకటే నవ్వు వాడిని చూసి. వెధవ పిలకా వాడూనూ" అంటూ ఇంకా ఏదేదో చెప్పబోయి భర్త ముఖంచూసి భయపడి ఆగిపోయింది.

'ఈ రోజు ఏం జరిగింది? ఇలా ఉన్నా రేమిటి?' అని ఆలోచిస్తూ.

పిచ్చేశ్వరరావు మేడమెట్లు విసురుగా దిగుతూన్నాడు, భార్యకి జవాబివ్వకుండానే.

ఎంతకీ క్రిందికి రాలేదని పిచ్చితల్లి సీనయ్యని పైకి తీసుకు వెళ్ళటానికి మెట్ల దగ్గరికి వచ్చింది. కొడుకు ముఖం చూస్తూనే గుండె దడ దడ లాడిపోయి మొదటి మెట్టు దగ్గరే ఆగిపోయింది.

ఈ ఇద్దరినీ చూస్తూనే పిచ్చేశ్వరరావు పైమెట్లు నాలుగు మాత్రమే దిగాడు.

సీనయ్య పిచ్చేశ్వరరావుని చూస్తూనే రెండుచేతులూ చాచాడు, కళ్ళనించి ఆనందబాష్పాలు జాలువారి పెరిగిన గడ్డంలో చిక్కుపడుతూండగా.

"పిచ్చిరాజా...నా పిచ్చిరాజా...ఎన్నాళ్ళకి దొరబాబులాగా ఉన్న నిన్ను చూశానూ!"

పిచ్చేశ్వరరావుకి తన బాల్యం గుర్తుకొస్తూంది. గతం కళ్ళముందు గిరగిరా తిరిగి పోతున్నది. ఈ సీనయ్యకి పెళ్ళి కాలేదు ఇరుగూ పొరుగూ అందరికీ సీనయ్య మామ. ఉన్నంతలో మాట సాయం, డబ్బు సాయం, రెక్కల కష్టం అందరికీ సహాయపడేవాడు. అతనికి నిదానస్తురాలైన పిచ్చమ్మ అంటే తగని గౌరవం. సొంత సోదరి లాగా ఆదరంగా మాట్లాడుతూ ఉండేవాడు. తను బడికి వెళ్ళనని మారాం చేస్తే, తన భుజాలమీద కూర్చోబెట్టుకుని పిప్పరమెంట్లు కొనిచ్చి ఆడిస్తూ పాడిస్తూ స్కూలు దగ్గర దించేవాడు. అప్పుడు "నా పిచ్చిరాజా! నువ్వు పెద్ద చదువులు చదివి పెద్ద పెద్ద ఉద్యోగం చేసి అమ్మని సుఖపెట్టాలి. నా బంగారు రాజా" అంటూ ముద్దు పెట్టుకునేవాడు.

తనకి ఎక్కడ డబ్బు వచ్చినా ఏదో ఒకటి తినేది కొని కొంగున మూట కట్టుకొని ఎంత రాత్రి అయినా సరే వచ్చి నిద్రపోతున్నా లేపి తినిపించేవాడు. ఒక్కొక్కప్పుడు ఆ నిద్రలో తినేసేవాడు గాని, మెలుకువ వచ్చేది కాదు. అంతా తిన్న తరువాత మెలుకువ వచ్చేది.

"పిచ్చిరాజా! నువ్వు పెద్ద మేడ కట్టాలి. ఆ మేడలో ఉయ్యాల బల్లమీద మీ అమ్మని కూర్చోబెట్టి ఊగించాలి. నేను ఒకవేళ చచ్చిపోయినా గుర్తు ఉంచుకుంటావు కదూ!" అంటూ ఎన్నెన్నో కబురుచెప్పి వెళ్ళిపోయేవాడు.

ఆ సీతయ్య నోటి వెంట వచ్చే ప్రతి మాటా తన లేత మనసులో మననం చేసుకుంటూ అతి కష్టపడి చదివాడు. ఒక్కొక్కటీ సాధిస్తున్నాడు.

ఇవన్నీ గుర్తుకు వస్తుంటే పిచ్చేశ్వరరావులో అప్పటి వరకూ ఉన్న ఆవేశం ఆవిరై కళ్ళలో సన్నటి నీటి ధార కదిలింది. గొంతుక పట్టుకుపోయింది. చాచిన ఆ చేతుల్లో వాలిపోయి చిన్నప్పుడు పొందే సంతృప్తి పొందాలని మనస్సు ఆరాట పడిపోయింది. పిచ్చేశ్వరరావు అమాంతం రెండడుగులు దిగేశాడు. తన నౌకర్లు విచిత్రంగా తమనే చూస్తూ ఉండటం కళ్ళపడింది. కదిలి ముందుకు ఒక్క అడుగు వెయ్యలేక అక్కడే ఆగిపోయాడు.

భర్తని రెచ్చగొట్టి ఇంక క్రింద ఏం జరుగుతుందో చూడాలని తొంగిచూసిన పద్మప్రియ ముఖం నల్లగా మాడిపోయింది.

సీనయ్య చేతులు నెమ్మదిగా క్రిందికి వాలిపోయాయి. తప్పేదో చేసేసినట్లు బాధపడిపోతూ,

"పిచ్చమ్మా ... వెడుతున్నా ... ఈ రోజు.. నాకు చాలా సంతోషంగా వుంది. వెళ్ళివస్తా" అంటూ పిచ్చితల్లి చెప్పేది వినిపించుకోకుండానే గేటు దాటేశాడు. నౌకర్లు అతను వెడుతూంటే ఇటూ అటూ ఊగుతున్న పిలకని చూస్తూ నవ్వుతూ గుస గుసలాడుకుంటున్నారు.

పిచ్చేశ్వరరావు చేతిలో మెట్ల పిట్టగోడ బిగుసుకుంది.

'ఏం చేయాలనుకున్నాను! ఏం చేశాను! అయ్యో... ఆయన వెళ్ళిపోయాడు.'

అక్కడే గోడకి ముఖాన్ని ఆనించి నిలిచిపోయాడు. పిచ్చేశ్వరరావు కళ్ళనించి ఒక్క కన్నీటిచుక్క రాలలేదు గాని మనస్సు దుఃఖంతో ఊగిపోయింది.

## 10

రాత్రి అశాంతిగా గడుస్తూంది.

పిచ్చేశ్వరరావుకి నిద్రరావటంలేదు.

పద్మప్రియ తన బట్టలన్నీ సర్దేస్తూంది. తనలోని అశాంతిని ఎంతో నిగ్రహించుకుంటూ, "పద్మా, నీ వింకా చిన్నపిల్లవుకావు బాధ్యత తెలుసుకో. ఈ ప్రయాణం ఆపుకో" అన్నాడు.

"నేను కావాలంటే మీరు అక్కడికి రండి. మళ్ళీ నా జన్మలో ఇక్కడికి రాను. జరిగిన అవమానం చాలు. నే నింక ఒక్క క్షణం ఉండను".

"పద్మ మనస్సులో ఎంత దృఢమయిన ఉద్దేశ్యం ఉన్నదీ ఆ మాటలో స్పష్టంగా తెలుస్తూంది. పిచ్చేశ్వరరావు ఆవేశాన్ని అదుపులో పెట్టుకోలేకపోయాడు.

"నీ ఇష్టంవచ్చినట్లు చెయ్యటానికి వ్యక్తిత్వం లేని

మగాడిని కాదు. నువ్వు నన్ను కొనలేదు. ఒక్క అడుగు ముందుకు వేశావా - జాగ్రత్త! కోపంవస్తే నేను చాలా చెడ్డవాడిని."

తీక్షణంగా వెలుగుతూన్న భర్త కళ్ళలోకి చూడ లేకపోయినా, బెదురుగానే - "నే నిక్కడ ఉండాలంటే మీ అమ్మ ఉండకూడదు" అన్నది.

"అమ్మ ఇక్కడే ఉంటుంది! నువ్వూ వుండితీరాలి. అయినా పెళ్ళికి ముందు నే నెవరి కొడుకునో మీకు తెలి యదూ! తెలిసి చేసుకొని ప్రతి క్షణం నా గుండెని యిలా మండిస్తా వెందుకు? పెళ్ళికిముందు కాలేజిలో నీ కెంత తంచి పేరుందో నాకు తెలియదూ! అయినా ఏ ఒక్క రోజన్నా ఒక్కమాట అన్నానా? నువ్వు చదువుకున్న మూర్ఖురాలివి. అందుకే నీకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాల విలువ తెలియదు. ఒళ్ళు దగ్గరపెట్టుకో!"

ఆ గదిలోంచి క్రిందికి వెళ్ళిపోయి హాలులోని సోఫాలో పడుకొని కళ్ళుమూసుకున్నాడు. కాని నిద్రరావ డంలేదు. కళ్ళు మండిపోతున్నాయి.

రెండురోజులు గడిచినాయి. పద్మప్రియ పచ్చి మంచి నీళ్ళు ముట్టలేదు. పిచ్చితల్లి కాలుకాలిన పిల్లిలా అటూ ఇటూ తిరుగుతున్నది. కోడల్ని బ్రతిమలాడింది అన్నం తినమని.

"నువ్వు అసలు ఈ గదిలోకి రావద్దు" అంటూ తలుపులు మూసేసుకుంది పద్మప్రియ.

'ఇదేం ఖర్మ...అసలే పట్టిమనిషి కూడా కాదు. ఏం చెయ్యను?' రాత్రి పగలూ ఆలోచిస్తూనే ఉంటోంది పిచ్చి తల్లి.

"అమ్మా! అమ్మా! నీనుమామ ఉత్తరం రాయిం చాడు. ఇదిగో, చదవనా?" ఆఫీసునుంచి వస్తూనే కవరులోని కాగితం బయటికితీసి పట్టుకుని తల్లి మంచంమీద కూర్చుని చదవటం మొదలుపెట్టాడు పిచ్చేశ్వరరావు.

"పిచ్చిరాజా!

భగవంతుడు నిన్నూ, నీ కుటుంటాన్నీ చల్లగా చూడాలి. సోదరి పిచ్చమ్మ కులాసా అని తలుస్తాను. నీ భార్యనీ, పిల్లలని చూసి ఆనందించాలని ఆశపడ్డాను. కుదరలే దనుకో. నీతో ఒక ముఖ్య విషయం చెప్పాలి. నే నింత వరకూ సంపాదించింది నా ఇష్టంవచ్చినట్లు, ఖర్చు చెయ్యగా మిగిలింది పన్నెండువందల ఏభై రూపాయలు. ఇది బాంకిలో నీ పేరున వేశాను, నువ్వు సంతకంపెడితే ఇచ్చేస్తారు.

ఈ డబ్బుని పాత్రనిఎరిగి దానంచెయ్యి సమాజంలో అట్టడుగునించి పైకిరావటానికి ప్రయత్నించే నా సోదర సోద రీమణులకు ఎవరికైనాసరే ఉపయోగించేటట్లు చూడు. పిచ్చిరాజా! ఒక ముఖ్యవిషయం గుర్తుంచుకో.

ఈ డబ్బు చదువునే విద్యార్థుల క్రింద ఖర్చుచెయ్య

వద్దు. ఎందుకంటే, ఈనాడు చదువులు ఉపాధిని చూపి ఆకలిని తీర్చలేకున్నాయి. మరి అలాంటి దానికింద ఎందుకు ఖర్చుచెయ్యాలి?

ఏదైనా ఒక పని చేసుకుంటూ ఈ పెట్టుబడితో పైకి వెళ్ళేవాళ్ళకి అందజెయ్యి. నా రెక్కలలో శక్తివుంటే మరి కొంత కూడబెట్టి మరోసారి నీకు అందిస్తాను. చూడు బాబూ! చదువురాని సీనయ్య మామ ఇంత ఉత్తరం ఎలా రాయగలిగాడా అని ఆశ్చర్యపోతున్నావా? ఉద్యోగం లేని పట్టభద్రుడు నేనిచ్చే అర్ధరూపాయికి ఆశపడి నా భావాలని మాటల రూపంలో సమన్వయపరచి నీకందిస్తున్నాడు. ఇంతే.

భగవంతుడు మిమ్మల్నందరినీ సదా రక్షించుగాక!

సీనయ్యమామ."

ఉత్తరం పూర్తిచేసి కళ్ళనిండి వచ్చే నీటిని కర్చీఫ్‌తో తుడుచుకుంటూ, 'అమ్మా! నేను చాలా తెలివితక్కువ పని చేశానమ్మా! మరోసారి ఇలాంటి పొరపాటు జరగదు... జరగదు' అని తనలో తనే అనుకున్నాడు పిచ్చేశ్వరరావు.

పిచ్చితల్లి కళ్ళుమూసుకొని వింటూంది కాని జవాబేం చెప్పలేదు.

సీనయ్యకెందుకింత తపన? "నా" అనేవారెవ్వరూ లేరు. కాని అందరూ ఆత్మీయులే. ఎందరికో చదువులకి సహాయపడటం పిచ్చితల్లికి తెలుసు. ఇలా కష్ట

పడి సంపాదించి పరులకి సహాయపడటంలో ఏదో తెలియని తృప్తి దొరుకుతుంది కాబోలు. లేకుంటే ఎందు కంత కష్టపడతాడు! ఇలా చూస్తే నిజంగా నే నెవరికోసం చేశాను! నా కొడుకుకోసం కష్టపడ్డాను - అంతేగా! సీనయ్య యెంత మంచివాడు ..భగవంతుడా, సీనయ్యని నాలుగు కాలాల పాటు చల్లగా చూడు!

తనలో తనే అనుకుంటూంది పిచ్చితల్లి.

“అమ్మా, మామ పంపిన ప్రతిపైసా సద్వినియోగం చేసాను. దీనితో పాటు నీ పేరుతో కూడా నా జీతంలో ప్రతి నెల...కొంత...” ఇంక కొడుకు చెప్పేది వినక—

“నాయనా, నీతో ఓ విషయం చెప్పాలని అనుకుంటున్నాను, శాంతంగా విను” అంది.

“అంత ఆలోచించటంఎందుకు? చెప్పమ్మా నీమాట ఎప్పుడు కాదన్నాను?” ఆసక్తిగా తల్లినే చూస్తూ పై ముడి విప్పి షర్టు బటన్సు ఊడదీస్తూ అన్నాడు.

“కాశీలో గంగా స్నానం చేస్తూ విశ్వనాథుడి సన్నిధిని కాలం గడపాలని ఉంది. మనం డబ్బు కొంత కడితే కావలసినవి అక్కడ సత్రంలో అమరుస్తారని తెలిసింది. ఆ వివరాలు కనుక్కొని...”

“అమ్మా!” బిగ్గరగా కేకపెట్టాడు. “ఈ ఆలోచన యెప్పటినించి?”

నిర్లిప్తంగా నవ్వింది పిచ్చితల్లి

"ఈ ఆలోచన ఈ నాటిదికాదు. సమయంరాలేదు, అడగలేదు. మానవజన్మ ఎత్తినందుకు కాస్త పుణ్యం పురుషార్థం చూసుకోవాలిగా? ఎల్లుండి మంచిదిట, నా ప్రయాణపు ఏర్పాట్లు చేయించు"

సీనయ్య మామ తనమీద కోపగించుకోకుండా ఉత్తరం రాశాడన్న సంతోషం ఎగిరి చక్కా పోయింది. తల్లి మాటతో గుండెని పిండుతూన్నంత బాధకలిగి, "వీల్లేదమ్మా, అలా వీల్లేదు. నీ పుణ్యం పురుషార్థం అంతా ఇక్కడే వెతుక్కో. భగవంతుడు ఇక్కడలేడూ!" అన్నాడు. జీరపోయింది గొంతు.

"దేశం తెగించి పోతున్నంతగా బాధపడతావేంరా, నాయనా! నన్ను వెళ్ళనివ్వు. నిను చూడాలంటే అప్పుడప్పుడూ వస్తూ ఉను. లేకుంటే ఓ కార్డు రాశావా నేనే వస్తాను" చాలా తేలిగ్గా జవాబిచ్చింది.

మొదట పరిహాసంగా అన్నదేమో అనుకున్నా తల్లి ముఖంలోకి చూసి ఇది గట్టి నిర్ణయమే అనుకుని నిర్జీవుడై, "ఇదేం నిర్ణయమమ్మా! వద్దు, వద్దు." అన్నాడు.

ఎంత చెప్పినా పిచ్చితల్లి తన పట్టు విడువలేదు.

పిచ్చేశ్వరరావుకి తల్లి ప్రయాణపు ఏర్పాట్లు చేయక తప్పలేదు.

# 11

"నీ నిర్ణయం కాదనే శక్తి నాకు లేదనుకో. కాని కొన్ని రోజుల తరవాత తిరిగి వస్తానని మాట ఇవ్వమ్మా."

తల్లి ఒడిలో తల దూర్చి పసివాడిలాగా అర్థిస్తున్న కొడుక్కి ఏమని జవాబిస్తుంది?

"నాన్నారూ, బామ్మతో నేనూ వెడుతున్నా" అంటూ మనమడు ప్రయాణ సన్నాహం చేసుకుంటూ వుంటే పిచ్చితల్లి నిబ్బరంగా ఉండలేకపోయింది. "ఏమిటీ బంధం? నవమాసాలూ మోసి కన్నకొడుకుని దూరంగా తోస్తున్నాను. వీడిని ఎందుకు వదలలేకుండా ఉన్నాను! లాభం లేదు. ఇలాంటి మమకారాలు వదిలెయ్యాలి" మనస్సుని గట్టిపరచుకోవడానికి ప్రయత్నిస్తూంది పిచ్చితల్లి.

రైలుకి టైము అవుతూంది. జీప్ వాకిట్లో నిలిచి వుంది. నౌకర్లు సామాను జీప్‌లో పెడుతున్నారు. తల్లికి సహాయంగా తన ఆఫీసులోని గుమాస్తాని వెంట పంపి అక్కడ అన్ని ఏర్పాట్లు చేసివచ్చేయమని పంపిస్తున్నాడు.

టైము అవుతూంది, పిచ్చేశ్వరరావు పిచ్చివాడిలాగా ఇటూ అటూ పచార్లు చేస్తున్నాడు.

'అమ్మని ఆపే శక్తి నా దగ్గరలేదు. ఆవిడ ఇక్కడ సుఖపడలేక పోతూంది. దీనికంతకీ పద్మ ప్రవర్తనే కారణం. అవును, అదే...'

అత్తగారు ఊరికి వెడుతున్నా పద్మప్రియ మేడ దిగి రాలేదు.

పిచ్చితల్లి దేవుడి మందిరం ఎదురుగా నిలిచి నిమీలిత నేత్రాలతో నమస్కరిస్తూంది.

"టెలిగ్రాం వచ్చింది సార్!" నౌకరు కవరు అందించాడు పిచ్చేశ్వరరావుకి.

"ఇప్పుడు టెలిగ్రాం ఎక్కడినించీ!" ఆత్రంగానే కవరు చించాడు. చదువుతూనే ఉలిక్కిపడి, మళ్ళీ మళ్ళీ చదివి, "ఏమి టిదంతా...నిజంగానే!" అంటూ షాక్ తిన్నట్టు కుప్పలా కూలిపోయాడు.

"ఎక్కడనించిరా, పిచ్చీ!" ఆత్రంగా అడిగింది తల్లి.

"ఇది...మామగారి... కాదు...కాదు...ఆయన్ని అలా...ఏంలేదు" తడబడుతున్న కొడుకుని అయోమయంగా చూస్తూంది ఆమె.

పద్మ 'టెలిగ్రాం' అన్న మాట వింటూనే పరుగున వచ్చి భర్తచేతిలోని కాగితం లాక్కొని లోపలి గదిలోకి వెళ్ళబోతూ చదివి, "ఆం. . నాన్న...గార్ని...అరెస్టు... ఎందుకూ!" అని కెవ్వున కేక పెట్టింది.

అప్పటికి నాలుగు రోజుల క్రితం రహస్యంగా తండ్రికి ఉత్తరం రాసింది, వెంటనే ఒకసారి రమ్మని. కాని...ఇదేం టెలిగ్రాం!

పిచ్చితల్లి కోడలి దగ్గరగా వచ్చేసింది.

"ఏమయిందమ్మా, పద్మా! అలా ఏడుస్తావెందుకూ! అయ్యో, నీవన్నా చెప్పరా!"

"మామగార్ని అరెస్టు చేశారుట."

"ఎందుకూ!" కారణం చెప్పేవరకూ వదల్లేదు పిచ్చి తల్లి.

"దొంగ నోట్లకట్టలు మార్పుచేస్తూండగా...పట్టుకుని ఉండచ్చు."

పద్మ వెక్కి వెక్కి ఏడుస్తూనే కోపంతో, "మా నాన్న దొంగకాదు, కాదు" అంది.

పిచ్చేశ్వరరావు పళ్ళు కొరుకుతూ అన్నాడు: "మీ నాన్న దొంగ కాదు. దొర...అందుకే పన్నెండు సంవత్సరాలుగా గవర్నమెంటు కళ్ళుకప్పి దొంగనోట్లు మార్చి అమాంతం లక్షాధికారి అయిపోయాడు. డబ్బు ఉండేసరికి సమాజంలో పెద్దమనిషి అయాడు. ఈనాటికి పాపంపడింది, పట్టుపట్టాడు. అసలు అతి మామూలు కుటుంబంగా ఉన్న మీరు ఇంత శ్రీమంతులు ఎలా కాగలిగారు? ఈ విషయాలు ముందే తెలిస్తే నీవీ యింటి కోడలివి అయ్యేదానివే కాదు. వంటమనిషి కొడుకు అని పదేపదే కించపరిచేదానివే - ఇప్పుడు చెప్పు, నీ వెవరి కూతురువి?"

పద్మ కుమిలి కుమిలి శోకిస్తూంది. అసలు సంగతి ఇప్పటికి అర్థం చేసుకోగలిగింది పిచ్చితల్లి. కొడుకు ఈ దుఃఖ

సమయంలో పద్మని అలా బాధపెట్టడం ఆమెకి మరీ బాధ కలిగించింది.

"ఈ సమయంలోనానువ్వు ఇలా మాట్లాడేది! తప్పు, నాయనా! తండ్రి ఎలాంటివా డన్నది మనకి అప్రస్తుతం. మరోసారి ఇలాంటి మాట నీ నోటినుంచి రాకూడదు. నాకు టైము అవుతుంది. నీవు రైలు దగ్గరకు రావద్దు. పద్మని తీసుకుని అక్కడికి వెళ్ళి పరిస్థితి ఏమిటో చూడు నాయనా! పద్మా, నేను వెళ్ళివస్తానమ్మా."

కోడలిని ఊరడిస్తూన్న తల్లిని చూస్తూ ఉండి పోయాడు పిచ్చేశ్వరరావు.

"బామ్మా, నేనూ వస్తా" అంటూ కాళ్ళకి చుట్టేసు కున్నాడు మనవడు. ఎవరు రమ్మని చేతులు చాచినా నాన మ్మని వదిలి వెళ్ళలేదు.

"పద్మా, బాబుని తీసుకో...ఏడవకు. పిచ్చన్న నిన్ను వెంట తీసుకుని వెడతాడు. వెళ్ళి అక్కడ అసలు సంగతి ఏమిటో చూడండి. ఏడవకు" అంటూ ఓదారు స్తున్న అత్తగారివైపు ఆశ్చర్యంగా చూసింది పద్మప్రియ.

"నేను...దొంగ కూతుర్ని.. నన్ను చూస్తే మీకు అసహ్యం వెయ్యటంలేదూ?"

"పిచ్చి పద్మా! నీవు ఎవరివో చెప్పనా! నా కోడలివి. ఈ యింటికి లక్ష్మివి. నా ముద్దుబాబుకి తల్లివి. మా

వంశాన్ని ఉద్ధరించటానికి వచ్చిన..." చిరునవ్వు నవ్వుతూ అంటూన్న అత్తగారి చేతుల్లో వాలిపోతూ—

"అత్తయ్యా!" అని వెక్కి వెక్కి ఏడుస్తూనే, "మిమ్మల్ని అర్థం చేసుకోలేకపోయాను, క్షమించండి. మీ రెక్కడికీ వెళ్ళవద్దు. నేను...నేను మిమ్మల్ని చాలా గాయపరిచాను" అంటూ రెండుచేతులతోనూ ముఖం దాచుకుంది.

నిజంగా పద్మేనా ఇలా మాట్లాడేది...పిచ్చేశ్వరరావు నమ్మలేనట్లు చూస్తున్నాడు. తన మనస్సులో అమ్మ అంటే ఉన్న అసహ్యం, జుగుప్స ఏమయినట్టు?

కోడలి ప్రవర్తనకి పిచ్చితల్లి ఆశ్చర్యపోయింది. కానే పటికి తెప్పరిల్లి కోడలి తల ప్రేమగా నిమురుతూ, "నీమాట కాదన్నందుకు బాధపడకు, నేను వెళ్ళిపోవాలి. రైలుకి టైము కావస్తున్నట్లుంది. పద్మా, ఒక్కమాట. ఈ దేవుడి మందిరంలో దీపారాధన మాత్రం చేస్తూ ఉండు. అదే ఈ ఇంటికి శ్రీరామరక్ష. మరి వెళ్ళిరానా నాయనా!...పద్మని తీసుకుని మీ మామగారి విషయం ఏమిటో చూడు" అంటూనే జీప్‌లో కూర్చుంది.

రైలు కూతవేసి బయలుదేరింది. కొడుకు కన్నీళ్ళతో కనిపించేంతవరకూ చెయ్యి ఊపుతూనే ఉన్నాడు. రైల్లో చాలా రద్దీగా ఉంది. పిచ్చితల్లి ఆ పెట్టెని అంతా కలయజూసి తన సామానులని ఒక్కసారి సరిచూసుకుంటూ ఉంటే చేతి సంచీలో మనవడి నిక్కరూ, షర్టూ కనిపించాయి.

పిచ్చితల్లి కళ్ళలో నీళ్ళు గిర్రున తిరిగాయి ఆ రెండూ ఎంతో ప్రేమగా తీసుకుని గుండెకి అన్చుకుంది. మన వడిని దగ్గిరికి తీసుకున్నప్పటి అనుభూతి కలుగుతూ ఉంటే 'ఏమిటిది ..ఎందు కింకా నాకీ వ్యామోహం! వీటికి అతీతంగా వెళ్ళదీయగలగాలనే కదూ విశ్వనాథుడి సన్నిధిని చేరుకోవటం' అనుకొంది.

ఆమె ఆ లాగూ, చొక్కా అలా చూస్తూనే ఉంది. కాని, విచిత్రం - ఆమె కళ్ళకి కనిపించేది విశ్వనాథుడూ, కాశీ అన్నపూర్ణా.

"ప్రభూ...నీవేనా...నేను నీ దగ్గరికి వస్తున్నానా, నన్నే నీవు వెతుక్కుంటూ వచ్చావా..." అంటూ కళ్ళు మూసుకుంది.

'నా అజ్ఞానంకానీ, నీవు లేనిదెక్కడ!' అనుకుంటూ నమస్కరిస్తున్న పిచ్చితల్లిని ఆ పెట్టెలోని తోటి ప్రయాణికులు విచిత్రంగా చూస్తూ, 'పిచ్చిదానిలా ఉందే!' అనుకున్నారు.

—♦ సమాప్తం ♦—